
# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 19-08-2022 ₹ 15/-



## రంగులు మారే రాజకీయాలు



### మానవతా పరిమళాలు వెదజల్లాలి

### స్వాతంత్రోద్యమంలో ముస్లిముల త్యాగాలు



గీటురాయి వారపత్రిక

# GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 44 సంచిక: 33 హైదరాబాద్
శుక్రవారం 19 ఆగస్టు 2022 రూ.15-00
20 ముహర్రం 1444 హిజ్రీ


**తొలిగీటు**

## లజ్జ (వ్రీడ) వల్ల మేలు మాత్రమే కలుగుతుంది."

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**
**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**
**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**
**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**
గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**
సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**
సేల్స్ మేనేజర్
**ముహమ్మద్ యాసీన్, 9700255736**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


కథ



**కరోనా కాటులో... 14**

## లోపల...


| | | |
|---|---|---|
| నా జన్మభూమి ఎంత అందమైన దేశము | ...... | 04 |
| రంగులు మారే రాజకీయాలు | ...... | 05 |
| మానవతా పరిమళాలు వెదజల్లాలి | ...... | 08 |
| చరితార్థులు– ముఖియుద్దీన్ ఫారూఖి | ...... | 11 |
| స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిముల త్యాగాలు | ...... | 12 |
| 'జన భారత్' ... 'జయ భారత్' | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| తల్లిదండ్రుల బాధ్యత | ...... | 21 |
| మదీనాలో తొలి రెండేళ్ళు | ...... | 22 |
| అబద్ధం మహాపాపం | ...... | 26 |
| జాతిని కదిలించిన స్వాతంత్రోద్యమ నినాదాలు | ...... | 28 |
| దైవప్రవక్తల అతిథి మర్యాదలు | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| మరో జీవితం లేదు అని తోసిపుచ్చితే జరిగే నష్టం ఏమిటి? | ...... | 34 |


**షాకిచ్చిన నితీష్ ....**




బీహారులో బీజేపీకి
నితీష్కుమార్ షాకు
పప్పులీడ ఉడకవని
చేశాడు చూడు షేకు!
మహారాష్ట్ర లాగానే
అల్లినరట కథనం
బెడిసికొట్టి ఎదురు
తిరిగిందట పథకం!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

## ఆలోచన

# నా జన్మభూమి ఎంత అందమైన దేశము

**భారతీయత** పునాదులు ప్రజాస్వామిక విలువలపై ఆధారపడి ఉన్నాయి. భారత ప్రగతి రథానికి సోషలిజం, సెక్యులరిజం రెండు చక్రాల్లా పని చేస్తున్నాయి. ధార్మికవిశ్వాసాలు, మతాచారాలు ప్రజల జీవితాలతో పెనవేసుకున్న సమాజం భారత సమాజం. అందువల్లనే సోషలిజం, సెక్యులరిజాలు ఎంతో అవసరమైనవి. ఈ విలువలను బలహీనపరిచే అనేక ప్రయత్నాలు చాలా శక్తులు చాలా కాలంగా చేస్తూనే ఉన్నాయి.

భారత రాజ్యాంగ రచన కాలంలోనే ఈ వాస్తవాలను గుర్తించి, బహుళమతాలకు, విశ్వాసాలకు, సంస్కృతులకు, భాషలకు పూర్తి అవకాశాలున్న భారతదేశానికి పునాదులు వేశారు. దేశంలో ప్రతి వ్యక్తికి తనకు ఇష్టమైన మతాన్ని ఎంచుకుని ఆచరించే స్వేచ్ఛ ఉంది. అలాగే మతప్రాతిపదికన ఎవరిపై కూడా ఎలాంటి వివక్షకు భారతరాజ్యాంగంలో అవకాశం లేదు. భిన్నత్వంలో ఏకత్వం భారత ప్రత్యేకతగా కొనసాగుతూ వస్తోంది. కాని సెక్యులర్ విలువలను వ్యతిరేకించే శక్తులు స్వతంత్ర సంగ్రామ కాలం నుంచి తమ ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. ఫలితంగా అనేక సందర్భాల్లో మతపరమైన అల్లర్లు భగ్గుమన్నాయి. సెక్యులర్ విలువల పరిరక్షణకు, మానవవిలువలను కాపాడ్డానికి మతాలకు అతీతంగా ప్రజలు నడుం కట్టిన సంఘటనలు కూడా చాలా ఉన్నాయి.

తనిష్క్ దేశంలో పేరున్న జువెలరీ బ్రాండ్. తనిష్క్ ఒక వ్యాపార ప్రకటన విడుదల చేసింది. ఒక ముస్లిం కుటుంబం తమ హిందూ కోడలిపై కురిపించిన ప్రేమాభిమానాలు ఆ ప్రకటనలో ఉన్నాయి. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటి చెప్పే ప్రకటన అది. కాని ఈ ప్రకటన చాలా మందికి రుచించలేదు. లవ్ జిహాద్ (అదెక్కడుందో, ఎన్ని కేసులున్నాయో ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు చెప్పలేదు) గగ్గోలు మొదలయ్యింది. ఈ ప్రకటన లవ్ జిహాద్‌ను ప్రోత్సహించేలా ఉందని రాద్ధాంతం చేశారు. చివరకు ఆ కంపెనీ ప్రకటన వెనక్కు తీసుకుంది. ఈ గగ్గోలు జరుగుతున్నప్పుడే ఒక జంట ఏ మాత్రం భయపడకుండా తమ మతాంతర వివాహం గురించి ప్రకటించింది. అంతేకాదు, తాము చాలా సంతోషంగా ఉన్నామని కూడా చెప్పారు. తనిష్క్ ప్రకటనపై అభ్యంతరాల గగ్గోలును చాలా మంది నిస్సంకోచంగా విమర్శించారు.

భారత ప్రభుత్వం 2019లో పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టంపై తీవ్రమైన నిరసనలు ప్రారంభమయ్యాయి. ముస్లిములను ఈ చట్టంలో మినహాయించి, మిగిలిన వారికి పౌరసత్వం ఇచ్చే చట్టాన్ని చాలా మంది విమర్శించారు. ఈ నిరసనల్లో కేవలం ముస్లిములు మాత్రమే కాదు, అన్ని మతవర్గాల ప్రజలు పాల్గొని భారత సెక్యులర్ విలువలను చాటి చెప్పారు.

త్రిపురలో 2021లో ముస్లిములపై దాడులు జరిగాయి. మతపరమైన అల్లర్లు ప్రారంభమయ్యాయి. నెమ్మదిగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తాయి. మహారాష్ట్రలోని అమరావతిలో కూడా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అమరావతిలోని వందేళ్ళ పాత మందిరంపై రెచ్చిపోయిన గుంపు దాడికి ప్రయత్నించింది. స్థానిక ముస్లిములు వెంటనే ఆ ప్రయత్నాలను అడ్డుకున్నారు. మానవహారంగా ఏర్పడి మందిరానికి రక్షణ కల్పించారు. ఈ మందిరం ముస్లిములు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతంలో ఉంది. బయటి నుంచి వచ్చిన అల్లరి మూకలు దాడికి ప్రయత్నించినప్పుడు స్థానిక ముస్లిములు ఈ ప్రయత్నాలను కొనసాగనివ్వలేదు.

గురుగ్రామ్‌లో ప్రతి శుక్రవారం ముస్లిములు నమాజు చేసే స్థలాలపై గగ్గోలు మొదలైనప్పుడు, సిక్కులు ముందుకు వచ్చి తమ గురుద్వారాలో స్థలాన్ని ముస్లిములు నమాజు చదువుకోడానికి ఇచ్చారు. ఒక హిందూ వ్యాపారి తన స్థలాన్ని నమాజు చదువుకోడానికి ఇచ్చాడు.

బాబరీ మస్జిద్, హిజాబ్ బ్యాన్, బహిరంగ ప్రదేశాల్లో నమాజుపై కేసులు, జ్ఞానవాపి మస్జిదు వివాదం, లవ్ జిహాద్, నౌకరీ జిహాద్, ఫ్లడ్ జిహాద్ (ఇంకా అనేక కొత్త కొత్త జిహాదుల పేర్లు మతోన్మాద శక్తుల నిఘంటువుల్లో ఉన్నాయి). ఇలాంటి అనేకానేక సంఘటనలు, వివాదాలు, మతపరమైన ఉద్రిక్తతలు, అల్లర్ల చీకట్లలో పైన పేర్కొన్న సంఘటనల వంటి వెలుగు కిరణాలు భారతీయత బలాన్ని చాటి చెబుతున్నాయి.




# రంగులు మారే రాజకీయాలు

**జనతాదళ్ యునైటెడ్** అధినేత నితీష్ కుమార్ రికార్డు సృష్టించాడు. ఎనిమిదో సారి బీహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ ముఖ్యమంత్రిగా రాష్ట్రీయజనతాదళ్ నాయకుడు తేజస్వీ యాదవ్ ప్రమాణస్వీకారం చేశారు. నిన్నటి వరకు నితీష్ కుమార్ భారతీయ జనతాపార్టీ నాయకత్వంలోని ఎన్డీయేలో ఉండేవారు. హఠాత్తుగా ఎన్డీయేకు బైబై చెప్పేసి, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడమే కాదు, రాష్ట్రీయ జనతాదళ్‌తో జట్టుకట్టి మళ్ళీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసారు. నిజం చెప్పాలంటే బీహారులో బీజేపీ కన్నా తక్కువ సీట్లు రాష్ట్రీయ జనతాదళ్ వద్ద ఉన్నాయి. అయినా నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా బీజేపీ ఎందుకు ఒప్పుకుంది? ఇప్పుడు నితీష్ కుమార్ ఎందుకు బీజేపీ గూటి నుంచి బయటకు వచ్చేశారు? ఈ ప్రశ్నలకు జవాబులు భారత రాజకీయాల చిత్రపటాన్ని మన ముందు ఆవిష్కరిస్తాయి.

నితీష్ కుమార్ బీజేపీల మధ్య ఇలాంటి పరిస్థితి ఇదే మొదటిసారి కాదు. నితీష్ కుమార్ తీసుకున్నన్ని యు టర్న్‌లు బహుశా మరో రాజకీయ నాయకుడెవ్వరు తీసుకుని ఉండరు. నితీష్ కుమార్ 2013లో బీజేపీకి గుడ్ బై చెప్పారు. అంతకు ముందు దాదాపు పది సంవత్సరాల పాటు బీజేపీ కూటమిలో కొనసాగాడు. బీజేపీకి గుడ్ బై చెప్పడానికి ముఖ్య కారణం నరేంద్ర మోడీని ప్రధానమంత్రి అభ్యర్ధిగా బీజేపీ ప్రచారం చేయడం. నరేంద్రమోడీ ప్రధాని అభ్యర్థిగా బీజేపీ చెప్పిన వెంటనే నితీష్ కుమార్ బీజేపీ కూటమి నుంచి బయటకు వచ్చేశారు. కాని 2014 ఎన్నికల తర్వాత జితన్ రామ్ మాంజీని ముఖ్యమంత్రి చేశారు. కాని కొద్దికాలానికే ఆయన్ను తొలగించి మళ్ళీ తాను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. 2015లో మహాఘట్ బంధన్‌తో కలిసి పోటీ చేశారు. మహాఘట్ బంధన్‌లో కాంగ్రేస్, ఆర్జెడిలతో కలిసి పోటీ చేసిన నితీష్ కుమార్ ఆ తర్వాత ఘట్ బంధన్‌కు తూట్లు పొడిచారు. రెండేళ్ళలోనే ఘట్ బంధన్ నుంచి బయటకు వచ్చి మళ్ళీ బీజేపీతో చేతులు కలిపారు. ఈ సారి

నరేంద్రమోడీ ప్రధానమంత్రిగా ఉన్నప్పటికీ బీజేపీతో చేతులు కలపడానికి నితీష్ కుమార్ ఎలాంటి అభ్యంతరాలు చెప్పలేదు. ఇప్పుడు మళ్ళీ బీజేపీకి బైబై చెప్పేసి ఘట్ బంధన్‌లోకి మళ్ళీ వచ్చారు. ఇన్ని సార్లు రాజకీయంగా రంగులు మార్చిన మరో నాయకుడు మనకు కనిపించడం చాలా అరుదు.

నితీష్ కుమార్ రాజకీయాల్లో నిజమైన చాణక్యం ప్రదర్శించారని చాలా మంది చెబుతారు. జనతాదళ్ యునైటెడ్‌లో కూడా నితీష్ కుమార్‌కు గతంలో జార్జి ఫెర్నాండజ్, శరద్ యాదవ్ ఇటీవల ఆర్సిపీ సింగ్ వంటి నాయకులతో పడలేదు. అనేకసార్లు యు టర్న్ తీసుకున్న ముఖ్యమంత్రిగా పేరున్నప్పటికీ నితీష్ కుమార్ రాజకీయంగా ఇప్పటికి కూడా బీహారులో బలమైన నాయకుడు. దీనికి ముఖ్యమైన కారణాలు మూడు.

బీహారులో 2005 తర్వాతి నుంచి జనతాదళ్ యునైటెడ్ అధికార పక్షంగా కొనసాగుతోంది. ఈ 17 సంవత్సరాల్లో 16 సంవత్స రాల కాలం నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోను ఓట్ల శాతం చూస్తే జనతాదళ్ యునైటెడ్ కనీసం అతి పెద్ద పార్టీగా కూడా రాలేదు. మూడో స్థానంలో ఉంది. బీజేపీ, ఆర్జెడీల తర్వాతి స్థానం మాత్రమే దక్కింది. సీట్ల విషయంలో ఇప్పుడు కూడా బీహారులో జనతాదళ్ యునైటెడ్ మూడో స్థానంలో ఉంది. అయితే బీహారులోని వెనుకబడిన కులాలు కుర్మీలు, కోరీలు, మహాదళితులు నితీష్ కుమార్ పక్షాన ఉన్నారు. వారి రిజర్వేషన్ల కోసం ఆయన పని చేశారు. సామాజిక న్యాయం కోసం పనిచేస్తున్న నాయకుడిగా పేరు సంపాదించుకున్నారు. తేజస్వీ యాదవ్ నాయకత్వంలోని ఆర్జెడీ కన్నా నితీష్ కుమార్ నాయకత్వంలోని జనతాదళ్ యునైటెడ్ పక్షాన ఉండడమే మంచిదని వెనుకబడిన వర్గాలు భావిస్తు న్నాయి. అలాగే అగ్రవర్ణాల పట్ల, హిందూత్వ పట్ల వ్యతిరేకత లేని నాయకుడిగా కూడా పేరుంది. అలాగే ముస్లిం వ్యతిరేకత లేని నాయకుడిగా కూడా పేరుంది కాబట్టి ముస్లిం ఓట్లను కూడా చాలా వరకు తన పక్షాన తిప్పుకో గలడు.

బీహారు ఉత్తరాది రాష్ట్రం. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తదితర దక్షిణాది రాష్ట్రాల వంటిది కాదు. దక్షిణాదిలో మోడీ ప్రభావం ఉత్తరాదితో పోల్చితే చాలా తక్కువ. బీహారు పొరుగునే ఉన్న ఉత్తరప్రదేశ్ లో బీజేపీ యాదవేతర ఓట్లను తనవైపు తిప్పుకో గలిగింది. అలాగే దళిత ఓట్లను కూడా ఆకర్షించగలిగింది. కాని బీహారులో బీజేపి ఆ పని చేయలేకపోయింది. ఉత్తర ప్రదేశ్‌లో ములాయం, తర్వాత అఖిలేష్ యాదవ్‌ల మాదిరిగా బీజేపీకి సవాలు విసిరి గట్టిగా నిలబడే ధైర్యం లేని నాయకుడిగా చాలా మంది నితీష్ కుమార్ గురించి చెబుతారు. కాని చాలా మంది ఆయన ప్రాక్టికల్‌గా ఆలోచించే నాయకుడిగా వర్ణిస్తారు. నితీష్ కుమార్ బీహారు రాజకీయాల్లో నిలబడడానికి బీజేపీతో దాగుడుమూతలు కొనసాగించారు. కొన్నిసార్లు ప్రత్యర్థిగా నిలబడి, మరికొన్ని సార్లు చేతులు కలిపి ముఖ్యమంత్రిగా కొనసాగాడని చాలా మంది అభిప్రాయం.

బీహారులో కొత్త రాజకీయ సమీకరణాలు భారత రాజకీయాలపై ప్రభావం వేస్తాయా? రానున్న 2024 సాధారణ ఎన్నికలపై ఎలాంటి ప్రభావం వేస్తాయన్నది ఆలోచించవలసిన ప్రశ్న. బీహారులో ఇప్పుడు జనతాళ్ యునైటెడ్, రాష్ట్రీయజనతాదళ్, కాంగ్రెసు పార్టీలు మళ్ళీ చేతులు కలుపుతున్నాయి. ఈ మూడు పార్టీలు కలిస్తే మెజారిటీ సాధించడం కష్టం కాదు. అసెంబ్లీ ఎన్నికలు 2025లో జరుగుతాయి. అంటే మూడేళ్ళ పాటు సమయం ఉంది. ఈ సమయంలో నితీష్ కుమార్ బీజేపీకి బైబై చెప్పి మహాఘట్ బంధన్‌లోకి రావడం బీజేపీకి విఘాతమే. బీహారు రాజకీయాల్లో నితీష్ కుమార్ ఊతంతో బలం పుంజు కోవాలని బీజేపీ ప్రయత్నిస్తూ వచ్చింది. మరోవైపు నితీష్ కుమార్‌ను బలహీనపరచడానికి చేయవలసిన ప్రయత్నాలన్నీ


## ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్‌ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**

చేసింది. 2020 బీహారు ఎన్నికల్లో ఈ ఎత్తుగడలు పనిచేశాయి. లోక్ జనశక్తి పార్టీ జనతాళ్ యునైటెడ్‌కు బైబై చెప్పి బీహారులో చాలా స్థానాలకు పోటీ చేసింది. దీనివల్ల జనతాళ్ యునైటెడ్ ఓట్లకు గండిపడింది. లోక్ జనశక్తి పార్టీ నాయకుడు చిరాగ్ పాశ్వాన్ బీజేపీకి లాభం చేకూర్చడానికే జనతాదళ్ యునైటెడ్‌తో తెగతెంపులు చేసుకున్నాడన్నది అందరికీ తెలుసు. చిరాగ్ పాశ్వాన్‌ను పావుగా బీజేపీ ఉపయోగించిందన్నది నితీష్ కుమార్‌కు కూడా తెలుసు. అప్పటి నుంచి బీజేపీ పట్ల నితీష్ కుమార్ గుర్రుగానే ఉన్నాడు. ఇటీవల నితీష్ కుమార్ సన్నిహితుడు ఆర్సీపీసింగ్ కూడా రాజీనామా చేసారు. ఆయన కూడా బీజేపీ ప్రోద్బలంతోనే రాజీనామా చేశాడన్నది నితీష్ కుమార్‌కు తెలిసిన విషయమే. మహారాష్ట్రలో శివసేన ప్రభుత్వాన్ని కూల్చిన మాదిరిగానే బీహారులో కూడా బీజేపీ రాజకీయాలు నడుస్తున్నాయన్నది నితిష్ కుమార్ పసిగట్టాడు.

రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చడం అనేది వరుసగా జరుగుతూ వస్తున్నదే. ఉత్తరాఖండ్‌తో మొదలు పెట్టి మహారాష్ట్ర వరకు జరిగింది ఇదే. ఉత్తరాఖండ్‌లో రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత పార్టీ మార్పిళ్ళు కొనసాగాయి. మధ్యప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రల్లో ఇదే జరిగింది. బీహారులో కూడా ఇదే జరగబోతుందన్న భయాలు చాలా కాలం నుంచి ఉన్నాయి.

జనతాదళ్ యునైటెడ్‌ను చీల్చి బీహారులో అధికారం హస్తగతం చేసుకునే ప్రయత్నాలు చేస్తారనే ప్రమాదాన్ని ముందే పసిగట్టిన నితీష్ కుమార్ ముందు జాగ్రత్త పడ్డాడని విశ్లేషకుల అభిప్రాయం. బీజేపీకి రాంరాం చెప్పి మహాఘుట్ బంధన్‌లో చేరడం ద్వారా బీహారులో బీజేపీ బలం పెంచుకునే ప్రయత్నాలను కూడా దెబ్బతీశారు.

హైదరాబాదులో ఇటీవల బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. దక్షిణాదిలో విస్తరించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. తెలంగాణా ఫస్ట్, తమిళనాడు నెక్స్ట్ అనే మాటలు వినిపిస్తున్నాయి. బీజేపీ ప్రయత్నాలు ముందే పసిగట్టిన తెలంగాణా ముఖ్యమంత్రి తన అసంతృప్తిని దాచుకోలేదు. తెలంగాణాలో చాలా మంది ఏక్ నాథ్ షిండేలున్నారని ఇక్కడి బీజేపీ నాయకుడు చేసిన వ్యాఖ్య కూడా గమనించదగింది. శివసేన నుంచి చాలా మంది ఎమ్మెల్యేలు పార్టీ మార్చిన సంఘటన ఇప్పుడు నితీష్ కుమార్, కేసీఆర్ వంటి నేతలకు ప్రమాద ఘంటికలా వినిపించింది. పార్టీ మార్పిళ్ళను ప్రోత్సహించి ప్రభుత్వాలను పడగొట్టే ప్రయత్నాలకు చెక్ పెట్టడం ప్రారంభించారు. మరోవైపు తమిళనాడులో ఆర్ ఎన్ రవిని గవర్నర్‌గా నియమించడం ద్వారా అక్కడ స్టాలిన్ ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేయడం ప్రారంభమయ్యింది. తమిళనాడులో మాజీ ఐపియస్ అధికారి కె.అన్నామలైను పార్టీ చీఫ్‌గా నియమించారు. సూపర్ స్టార్ రజనీకాంత్‌ను తమ వైపు తిప్పుకోవాలని ప్రయత్నించినా బీజేపీకి సాధ్యపడలేదు. ఆయన బీజేపీ పక్షాన మొగ్గు చూపించలేదు. అన్నాడిఎంకేలో కొనసాగుతున్న లుకలుకలు బీజేపీకి ఉపయోగపడతాయా? తమిళనాడు, తెలంగాణాల్లో విస్తరించే ప్రయత్నాలు జోరుగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీహారు పరిణామాలు ముందుకు వచ్చాయి.

బీహారు పరిణామాలను జాతీయ రాజకీయాల కోణంలో చూడాలి. బీహారు రాజకీయాలు కుల సమీకరణాల రాజకీయాలు. ఉత్తరప్రదేశ్ మాదిరిగా హిందూత్వ రాజకీయాలు బీహారులో లేవు. 2024 ఎన్నికల్లో మహాఘుట్ బంధన్ బీహారులో బీజేపీకి గట్టి పోటీ ఇవ్వడమే కాదు, ఓడించే బలం కలిగి ఉంది. మహారాష్ట్రలో శివసేనను చీల్చి సాధించిన రాజకీయ ప్రయోజనాలకు బీహారు పరిణామాలు చెక్ చెబుతున్నాయి.

అయితే నితీష్ కుమార్, తేజస్వీ యాదవ్ ఈ నేతల మధ్య ఈ మూడేళ్ళ పాటు సంబంధాలు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. బీజేపీని ఓడించాలనుకుంటే ఈ నాయకులు ఇద్దరు ఈ రెండేళ్ళపాటు బీహారులో అద్భుతమైన పరిపాలనను అందించి తమను తాము రుజువు చేసుకోవలసిన అవసరం ఉంది.

ఈ సారి తేజస్వీ యాదవ్ కూడా 2024 వరకు కనీసం ఈ పొత్తును దెబ్బతీసే పనులేవీ చేయకపోవచ్చు. నితీష్ కుమార్‌ను తేజస్వీ యాదవ్ ప్రశంసలతో ముంచేత్తాడు. ఇప్పుడు బీహారులో కూడా పాత ఫైళ్ళ బూజు దులిపే పనిలో కేంద్రసంస్థలు బిజిగా ఉంటాయని చాలా మంది అభిప్రాయం. కాని నితీష్ కుమార్‌పై ఆరోపణలు సంధించడం అంత తేలిక కాదు. ఎందుకంటే, ప్రభుత్వంలో బీజేపీ కూడా ఆయనతో పాటు కలిసి పనిచేసింది. అలాగే కేంద్రం అణిచివేత చర్యలేమైనా తీసుకుంటే బీహారీ ఓటర్లు తీవ్రంగా ప్రతిస్పందించే అవకాశం ఉంది. దానివల్ల బీజేపీకి ఎన్నికల్లో మరింత నష్టం కలగవచ్చు. ఏది ఏమైనా బీహారు పరిణామాలు ప్రతిపక్షాలకు కొత్త బలాన్నిచ్చాయి. బీహారు మహారాష్ట్ర వంటిది కాదని రుజువయ్యింది. ✤




**ఎదుటి వ్యక్తి కష్టాన్ని చూసి నీ కంట్లో కన్నీరు ఉబికిందంటే, నీలో మానవత్వం ఉన్నట్టే లెక్క. ఎదుటి మనిషిపై నువ్వు చూపించే ప్రేమ, వారి కష్టాలకు స్పందించే తీరు, నీ చర్యల్లో కనిపించే సేవాభావాలే నీలో మానవత్వం ఉన్నదా లేదా? అనేది తెలియజేస్తుంది.**

ఒక వ్యక్తి ధర్మబద్ధమైన జీవితాన్ని గడుపుతున్నాడు అని చెప్పడానికి, ఆ వ్యక్తి మంచి రచనా సామర్థ్యం కలిగిన రచయితో లేక మంచి వాక్చాతుర్యం కలిగిన ఉపన్యాసకర్తో కొలమానం కాదు. తోటి మనిషితో అతడు కలిగి ఉండే సంబంధాలు అత్యంత ఆదరణీయమైనవిగా ఉన్నప్పుడే ఆ వ్యక్తిని మనం ధార్మికుడిగా లెక్కించగలం.

కులమతాలకు అతీతంగా మనుషులందరినీ ప్రేమించటం, ఆర్తులపై అమితమైన దయ, కారుణ్యాలను చూపించి వారిని ఆదుకోవడం, వంటి లక్షణాలను మానవుడి మనస్తత్వంతో కలగలిపి ఆ సర్వ సృష్టికర్త మానవజాతిని పుట్టించాడు. ఈ లక్షణాలనే మానవత్వం అంటారు.

మనిషి జీవితానికి అలంకరణ మానవత్వం. కానీ నేడు అహంకారం, అసూయ, ద్వేషం, ఆత్మస్తుతి, ఆగ్రహం, అసహనం, కృతఘ్నత వీటన్నింటికీ మించి ధన వ్యామోహం వంటివి మానవ జీవితానికి అలంకరణలుగా మారిపోయాయి.

పెరుగుతున్న వయసుతో పాటు, తల్లిదండ్రులు అవలంబించే పద్ధతుల రీత్యా, చుట్టూ ఉన్న వాతావరణం రీత్యా మనిషి మానవత్వాన్ని మరచిపోయి, అతి కిరాతకంగా, మృగంగా మారుతున్నాడు. అటువంటి వ్యక్తుల పేరు చెపితే ఒక్కోసారి ఆ అడవి మృగాలు కూడా తలదించుకుంటాయేమో అనే దారుణమైన మారణకాండలు నేడు మనం చూస్తున్నాం. ఈ విపరీతాలకు బలిపశువులుగా మారుతున్న వారిలో

ఆడవాళ్లు, మగవాళ్ళు, పిల్లలు, వృద్ధులు అందరూ ఉన్నారు. అన్నింటికీ కారణం ఒకటే మానవత్వ లేమి.

మానవత్వం లేని మనుషులను తోటిమానవులే కాదు వారిని సృష్టించిన సృష్టికర్త కూడా ఇష్టపడడు, క్షమించడు. ప్రతి సంవత్సరం ఆగస్టు 19న "ప్రపంచ మానవతా దినోత్సవాన్ని" ప్రపంచం మొత్తం జరుపుకుంటారు. ఇరాక్ పట్టణం బగ్దాద్ లోని కెనాల్ హెూటల్‌పై 19 ఆగస్టు 2003లో బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో ఇరాక్ ముఖ్య మానవతావాది సెర్గియో వైరా డి మెల్లోతో సహా 22 మంది మరణించారు. దాని జ్ఞాపకార్థం ఆగస్టు 19వ తేదీని మానవతా దినోత్సవంగా జరపాలని నిర్ణయించారు. 2009లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఈ రోజును "ప్రపంచ మానవతా దినోత్సవం" (World Humanitrrian Day) గా ప్రకటించింది.

మానవత్వం అంటే కేవలం ఒకరికి ఒకరు సహాయం చేయడం మాత్రమే కాదు, తన చుట్టూ ఉన్న ఇతర జీవజాతులు, జంతు జాతులకు, వాతావరణానికి నష్టం కలిగించ కుండా ఉండడం. ఈ రోజు కొన్ని కోట్ల మంది ప్రాణాలను ప్రమాదంలో నెట్టివేసి, వారి ఇళ్లను, వారి జీవనోపాధిని, వారి జీవితాలను ధ్వంసం చేసే పరిస్థితులు మన చుట్టూ అల్లుకుని ఉండడానికి కారణం కూడా మానవత్వం లేని మనుషులే. మానవత్వాన్ని విస్మరించి ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా మనిషి అనుసరిస్తున్న నిరంకుశమైన, నికృష్టమైన పద్ధతులే నేడు అతి ఘోరమైన ప్రకృతి విపత్తులకు కారణమవుతున్నాయి.

మానవ వ్యవహారం ప్రతీదీ ఎవరి ఇష్టమొచ్చిన రీతిలో కాకుండా ప్రతి వ్యవహారం దైవభీష్టానికి అనుగుణంగా, దైవ కారుణ్యానికి ప్రతీకగా జరగాలి. మనిషి జీవితం మానవ సంబంధాల సమ్మేళనం. కుటుంబ, సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలన్నింటిలోనూ ఆ సంబంధాలు సత్సంబంధాలుగా మారినప్పుడే మనిషి మనిషిగా పురోగమించగలుగుతాడు, తద్వారా దేశాభివృద్ధి కూడా పురోగమన స్థాయిలో ఉంటుంది. "మీరు భూవాసులపై కరుణ చూపండి, ఆకాశ వాసి మీపై కరుణ చూపుతాడు" అని అంటారు ముహమ్మద్ ప్రవక్త (స).

తల్లిదండ్రుల హక్కులు, సంతానం, భార్యాభర్తల, బంధువుల హక్కులతో పాటు పొరుగువారి హక్కులను నెరవేర్చాలన్నది ఇస్లామ్ స్ఫూర్తి. హక్కుల గురించి తీర్పుదినం రోజు ప్రశ్నించడం జరుగుతుంది. హక్కులను కాలరాస్తే మాత్రం దైవం నుండి మనిషికి ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమాపణ దొరకదు. తోటి మనిషి హక్కు కొల్లగొట్టడం, బాధ కలిగించడం అనేవి ఒక వ్యకి యొక్క అన్ని రకాల ఆరాధనలను వృథా చేస్తాయని ఇస్లాం చెపుతోంది. అందుకే ఎవరి హక్కులను వారికి చెల్లించాలి, అదేవిధంగా ఎవరిపైనా గానీ, ఎవరి హక్కులపైనా గానీ దౌర్జన్యం చేయకూడదు. అసత్య ఆరోపణలూ, నిందారోపణలూ చేయకూడదు. చెడుప్రవర్తనకు దూరంగా ఉండాలి. మన మాటల వల్లగానీ, చేతల వల్ల గానీ ఎవరికీ కష్టం కలిగించరాదు. సహాయం చేసే నెపంతో బహిరంగంగా ఏవో రెండు పనులు చేసి, ఫొటోలు, వీడియోలు తీసుకుంటే అది మానవసేవ అనిపించుకోదు. అటువంటి చర్యలతో సహాయార్థులను అవమానించడమే అవుతుంది. తోటివారితో మంచిగా వ్యవహరించడమే అసలైన మానవత్వం.

అత్యధికంగా దానధర్మాలు చేయాలనీ, అగత్యపరులకు అత్యధికంగా ఆర్థిక సహాయం చేయాలనీ, మహా ప్రవక్త (స) వారు తన అనుచరులకు బోధించినప్పుడు ఒక సహాబీ తన వద్ద ఏమీ లేదని చెప్పగానే, దానికి సమాధానంగా ప్రవక్త (స) వారు ఇలా అన్నారు: ఎదుటి వ్యక్తికి సహాయం చేయడం ఎంత ముఖ్యమో, ఎదుటి వ్యక్తిని కష్టపెట్టకుండా ఉండడం కూడా అంతే ముఖ్యం.

తీర్పుదినం రోజు లెక్కతీసుకునేటప్పుడు అన్యాయానికి పాల్పడ్డ వ్యక్తి నుండి హక్కును ఇప్పిస్తాడు ఆ దైవం. ఇహలోకంలో ఇచ్చినట్టు లంచం ఇచ్చి తప్పులు మాఫీ చేసుకునే అవకాశం అక్కడ ఉండదు. చేసిన తప్పుకు ప్రతిఫలంగా తప్పు చేసిన వ్యక్తి తన పుణ్యాలను తన వల్ల బాధలు అనుభవించిన వ్యక్తికి ఇవ్వవలసి ఉంటుంది. ఒకవేళ తప్పు చేసిన వ్యక్తికి తన ఖాతాలో ఉన్న పుణ్యాలు మొత్తం హరించుకుపోయి ఉంటే తన మూలంగా బాధితుడైన వ్యక్తి యొక్క పాపాలను తన ఖాతాలో వేసుకోవలసి ఉంటుంది. అంతేకానీ, పీడితుడు స్వయంగా క్షమించనంత వరకు దైవం తనంతట తాను ఏ దౌర్జన్యపరుడినీ క్షమించడు. ఇంత అనర్థానికి ఒకటే కారణం, ఒక వ్యక్తి తన మాటల వల్ల గానీ, తన చేతల వల్ల గానీ తోటి వ్యక్తికి బాధకలిగేలా వ్యవహరించడం అమానవీయమే అవుతుంది.

ఇటువంటి వర్గానికి చెందిన వ్యక్తుల గురించి దైవ ప్రవక్త(స) హదీసులో చాలా చక్కగా వివరించారు. "నా అనుచర సంఘంలో ఒక పేదవాడు ప్రళయదినం నాడు వస్తాడు, అతను చాలా ఎక్కువ నమాజులు, చాలా ఎక్కువ ఉప

వాసాలు, చాలా ఎక్కువ దానాలు చేసి ఉంటాడు. అయితే వాటితోపాటు అతడు ఎవరినైనా తిట్టి ఉండవచ్చు, ఎవరికైనా బాధ కలుగజేసి ఉండవచ్చు. ఎవరి సొమ్ము అయినా తిని ఉండవచ్చు, ఎవరి రక్తం అయినా చిందించి ఉండవచ్చు, ఎవరినైనా కొట్టి ఉండవచ్చు. ప్రళయం రోజు అల్లాహ్ సమక్షంలో అతని వల్ల అన్యాయానికి, దౌర్జన్యానికి గురయిన ముద్దాయిలందరూ నిలబడతారు. అప్పుడు అల్లాహ్ అతని సత్కర్మలను వారందరికీ పంచివేస్తాడు. ఇలా పంచి ఇచ్చిన తరువాత అతని సత్కర్మలన్నీ అయిపోతే పీడితుల కర్మ పత్రాలలోని దుష్కర్మలను అతని కర్మలపత్రంలో వేయడం జరుగుతుంది. తరువాత ఆ మనిషి ఉత్త చేతులతో మిగిలి పోతాడు. అప్పుడు అతన్ని అగ్నిలో పడవేయడం జరుగు తుంది''.

మానవ హక్కులకు, ముఖ్యంగా మానవ ప్రాణానికి ఎంత ప్రాముఖ్యం ఉందనే విషయాన్నీ దివ్యఖుర్ఆన్ మనకు ఒక్క వాక్యంలో తెలియజేస్తుంది. **"ఎవడైతే ఒక ప్రాణాన్ని అన్యా యంగా తీస్తాడో అతను సర్వ మానవాళిని హత్య చేసినట్టే, ఎవడైతే ఒక ప్రాణాన్ని కాపాడుతాడో అతడు మొత్తం మాన వాళిని కాపాడినట్టే".**

ఈ రోజు కోట్ల మంది ప్రపంచం మొత్తంమీద ఇస్లాంను నమ్ము తున్నారంటే అందుకు కారణం ఇస్లాం చూపించే మానవత్వం, తన బోధనల ద్వారా కల్పించే కారుణ్య వాతావరణం. ప్రపంచం మొత్తం కరోనా కారణంగా అతలాకుతలం అయి పోయిన రోజున, ప్రేగుబంధం, రక్తసంబంధం కూడా జనం మర్చిపోయి, ప్రజలు తమ ప్రాణాల కోసం ప్రాకులాడిన రోజున కేవలం ఇస్లాం నేర్పిన మానవత్వంతో ప్రాణాలకు తెగించి మానవ సేవ చేసిన వారిని ఇప్పటికీ మనం మర్చి పోలేం.


ఫ్రీడమ్ హౌస్ ఆఫ్ అమెరికా తన నివేదికలో 2014 తర్వాత మన దేశంలో మానవ హక్కులు, పౌరహక్కులు క్రమంగా ఏ విధంగా దెబ్బతింటూ వస్తున్నాయో తెలిపింది. భారతదేశం బహుళపక్ష ప్రజాస్వామ్య దేశం అయినప్పటికీ, ఇక్కడ ఎటు వంటి వివక్ష పూరిత విధానాలను అనుసరిస్తున్నారో, అట్ట డుగు వర్గాలపై వేధింపులు ఏ విధంగా గణనీయంగా పెరుగుతున్నాయి అనే విషయాలను ఆ నివేదికలో వివరిం చింది. భారత రాజ్యాంగం భావప్రకటనా స్వేచ్ఛ, మత స్వేచ్ఛతో సహా పౌర హక్కులకు హామీ ఇస్తుంది. కానీ మన దేశంలో కులమతాల ప్రాతిపదికన ఏ విధమైన వివక్ష పెరుగుతుందో, తత్కారణంగా ముస్లింలు, షెడ్యూల్డ్ కులాలు (దళితులు), షెడ్యూల్డ్ తెగలు (ఆది వాసీలు) ఆర్థికంగా, సామాజికంగా అట్టడుగున ఉన్నారు అనే విషయా లను ఆ నివేదికలో ప్రస్తావించింది.

మానవత్వ లేమి అనేది మనిషికి వచ్చే రోగం కాదు. మన సుకు వచ్చే రోగం. హృదయ శుద్ధి లేకపోవడం వల్ల ఆ రోగం వస్తుంది. దైవప్రవక్త (స) ఈ విధంగా సెలవిచ్చారు, "గుర్తుం చుకోండి! మానవుని శరీరంలో ఒక ముద్ద ఉంది. అది బాగుంటే శరీరం మొత్తం బాగుంటుంది. అది గనక చెడిపోతే శరీరం మొత్తం చెడిపోతుంది. మొత్తం శరీరాన్ని మంచిదిగా లేదా చెడుగా మార్చే ఆ ముద్ద మానవుని హృదయం''.

మనిషి హృదయంలో గుండె కవాటాలు సరిగా పని చేస్తున్నాయో లేదో? రక్తప్రసరణ సరిగా జరుగుతుందో లేదో? నరాలలో రక్తం సరిగా ప్రవహిస్తుందో లేదో? అనేది మాత్రమే వైద్యులు తెలుసుకోగలుగుతారు. కానీ హృదయ కవాటా లను అంతరాత్మతో తెరిచి చూస్తే, నీ హృదయంలో గర్వం, అసూయ, పగా, ద్వేషం వంటి ప్రతికూల భావాలు ఉన్నాయో, ప్రేమ, కరుణ, వినమ్రత, వాత్సల్యం వంటి అను కూల భావాలు ఉన్నాయో తెలుస్తుంది. మానవత్వం కలిగిన వ్యక్తిగా మిగలాలంటే ప్రతి మనిషికీ ఈ అనుకూల భావాలు చాలా అవసరం. వాటిని పెంపొందించుకునే దిశగానే ప్రతీ వ్యక్తి పరిశ్రమించవలసి ఉంటుంది.

1450 సంవత్సరాల క్రితం ముహమ్మద్ ప్రవక్త(స) తనను దైవం ప్రవక్తగా ఎన్నుకున్నాడని, తనపై దైవాజ్ఞ అవతరి స్తుందని చెప్పినప్పుడు ఆయన చుట్టూ ఉన్న తన స్నేహితులే కాదు, ఆయన యొక్క శత్రువులు కూడా ఆ విషయాన్ని అంగీకరించారు. అందుకు ఒక్కటే కారణం. 40 సంవత్స రాలపాటు మానవత్వపు పరిమళాలు నలుదిశలా వ్యాపించే విధంగా ఆయన తయారుచేసుకున్న తన వ్యక్తిగత జీవితం. నేటికీ, 1450 సంవత్సరాలు గడిచిపోయిన తర్వాత కూడా ప్రపంచం మొత్తం మీద కోట్లమంది ముహమ్మద్ ప్రవక్త(స)ను ప్రేమిస్తున్నారంటే కారణం బ్రతికుండగా ఆయన (స) తన తోటివారిపై కురిపించిన మానవత్వం, చెడులతో రాజీ పడని ఆయన (స) వ్యక్తిత్వం. అదే బాటలో ప్రపంచ మానవాళి మొత్తం నడిచిన రోజున ప్రతి రోజూ ప్రపంచానికి మానవతా దినోత్సవమే. ✤

'చరితార్థులు'



# ముఖియుద్దీన్ ఫారూఖి (1920-1997)


138

'గాంధేయ మార్క్సిస్ట్'గా ప్రజల, సహచరుల మన్నన పొందిన ముఖియుద్దీన్ ఫారూఖి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సహరాన్‌పూర్ జిల్లాలోని అంబేహటా గ్రామాన 1920 లో జన్మించారు. 1857లో ఆయన పూర్వీకులను ఆంగ్లేయులు ఉరితీశారు. ఆ తరువాత సాగిన భారత జాతీయోద్యమంలో ముఖియుద్దీన్ తండ్రి, సోదరులు పాల్గొన్నారు. 1923లో తండ్రి మౌలానా మొయినుద్దీన్ ఫారూఖి కన్నుమూయడంతో 1927లో ఢిల్లీలో ఉంటున్న సోదరుడి వద్దకు చేరారు. 1934లో సెయింట్ స్టీఫన్ కళాశాలలో చేరిన ముఖియుద్దీన్ ఖాది వస్త్రధారణతో తన ప్రత్యేకత చాటుకున్నారు. 1936 జూలైలో జవహర్‌లాల్ నెహ్రూ, ముహమ్మద్ అలీ జిన్నాలు పాల్గొన్న అఖిల భారత విద్యార్థి సమావేశాన్ని ఆహ్వాన సంఘం అధ్యక్షునిగా ఆయన నిర్వహించారు. ఉద్యమకారుల కుటుంబం నుండి వచ్చిన ఆయన కళాశాల విద్యార్థిగా 1936 నుండి జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొనడం ఆరంభించారు. 1940 నవంబరులో జవహర్‌లాల్ నెహ్రూ అరెస్టు, ఆంగ్ల ప్రభుత్వం నిరంకుశ చర్యలకు, సామ్రాజ్యవాద ధోరణులకు వ్యతిరేకంగా సమ్మె ప్రకటించి విశ్వవిద్యాలయం విద్యార్థులతో ఆయన భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆ కారణంగా ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆయనను బహిష్కరించి, ఆయన ఎం.ఏ డిగ్రీని రద్దుచేసింది. 1940లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, సమాఖ్య పటిష్టత - విస్తరణకు అవిశ్రాంతంగా శ్రమించిన ఆయన కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించినా ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక కమిటి సభ్యునిగా 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొన్నారు. అందుకుగాను ముఖియుద్దీన్ 14 మాసాల జైలుశిక్షను అనుభవించారు. మతాన్ని రాజకీయాలతో ముడిపెట్ట రాదన్న భావన కలిగిన ముఖియుద్దీన్ మతం పేరిట లీగ్ సాగించిన వేర్పాటు ఉద్యమాన్ని, విభజనను వ్యతిరేకించారు. రెండవ ప్రపంచ యుద్ధంలో సాధించిన విజయానికి చిహ్నంగా ఆంగ్ల ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమాలను బహిష్కరించమని, హర్తాల్ పాటించమని ఢిల్లీ ప్రజలకు పిలుపునిచ్చినందుకు ఆయన నిర్బంధానికి గురయ్యారు. 1947 నాటి విభజన సందర్భంగా తలెత్తిన కల్లోల పరిస్థితులను చక్కదిద్దేందుకు, మత సామరస్యం కాపాడేందుకు మహాత్ముడు, మౌలానా అబుల్ కలాం ఆజాద్ మార్గదర్శకంలో ఎంతో శ్రమించారు. స్వాతంత్ర్యానంతరం భారత కమ్యూనిస్టు పార్టీలో పూర్తి స్థాయి కార్యకర్తగా పలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రభుత్వ పదవులు ఆయన గడప వద్దకు వచ్చినా ముఖియుద్దీన్ చేపట్ట లేదు. చివరకు రాష్ట్ర గవర్నర్ పదవి చేపట్టమని ప్రధాన మంత్రి హెచ్.డి. దేవగౌడ స్వయంగా ఆహ్వానించినా ఆయన వద్దన్నారు. 1940లో రద్దు చేయబడిన ఆయన ఎం.ఏ. డిగ్రీ సర్టిఫికేట్‌ను మాజీ రాష్ట్రపతి శంకర దయాల్ శర్మ సమక్షంలో ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవంగా 1989లో అందచేసింది. చివరి వరకు ప్రజాసేవకుడిగా అతి సాధారణంగా జీవితం గడపిన ముఖియుద్దీన్ ఫరూఖి ఢిల్లీలో జరిగిన ఒక సభలో ప్రసంగిస్తూ 1997 సెప్టెంబర్ మూడున ఆఖరిశ్వాస విడిచారు. ✤




✆ 9440241727


బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' (తెలుగు) 'ది ఇమ్మోర్టల్స్' (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



# స్వాతంత్రోద్యమంలో ముస్లిముల త్యాగాలు

**ముహమ్మద్ ఉస్మాన్‌ఖాన్**

**'కుఛ్ ఆర్జూనహీ.., హయ్ తొ బస్ ఇత్‌ని.., రఖ్ దె కోయీ ఖాకె వతన్ మేరె కఫన్ మే..'**

(ఒకే ఒక్కకోరిక. అది తప్ప నాకు మరెలాంటి కోరికా లేదు. నా కఫన్‌లో నా జన్మభూమి మట్టిని కాస్త ఉంచండి. అంతేచాలు)

దేశ స్వాతంత్ర్యం కోసం ఉరితాడును ముద్దాడుతూ భారతదేశ ముద్దుబిడ్డ అమరజీవి అష్ఫాఖుల్లాఖాన్ పలికిన మాటలివి.

ఈ దేశాన్ని, ఈ మట్టిని ముస్లిములు ఎంతగా ప్రేమిస్తారో తెలుసు కోడానికి ఇదొక చిన్న ఉదాహరణ.

నిజానికి ముస్లిములు దేశ స్వాతంత్ర్యం కోసం అనుపమానమైన, అసాధారణమైన పాత్రను పోషించారు. శతాబ్దాలుగా దేశం కోసం పోరాడారు. ఇళ్ళూ వాకిళ్ళు వదిలిపెట్టారు. దేశ బహిష్కారం గావించబడ్డారు. చెరసాలల పాలయ్యారు. చీకటి గుయ్యారాల్లో నిర్బంధించబడ్డారు. ఉరికంబాలపైకి ఎక్కించబడ్డారు. రకరకాలుగా హింసించబడ్డారు. కుటుంబాలను, బంధు మిత్రులను త్యాగం చేశారు. తమ సర్వస్వాన్నీ తృణప్రాయంగా ధారపోసిన ఫలితంగా ఎట్టకేలకు స్వాతంత్ర్యం లభించింది. దేశం ఆంగ్లేయుల బానిసత్వం నుండి విముక్తి పొందింది. అమరవీరుల త్యాగాలు ఫలించి, వారి కలలు సాకారమయ్యాయి. భారతావని ఈనాడు సర్వ స్వతంత్ర దేశం. ప్రతి యేటా గుండెల నిండా సంతోషంతో, కన్నుల పండువగా స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నాం. కాని స్వాతంత్ర్య సాధన కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అనేక మంది త్యాగ ధనులను మనం తరచుగా మరచిపోతూ ఉంటాం. లేక కావాలనే వారి త్యాగాలను మరిపించే ప్రయత్నాలు జరుగుతూ ఉంటాయి.

స్వాతంత్రోద్యమంలో ముస్లిముల పాత్రను తొలగించడానికి, మరీ తప్పనిసరి పరిస్థితులు ఏర్పడితే బాగా తగ్గించి చూపడానికి, కావలసినన్ని ప్రయత్నాలు గతంలోనూ జరిగాయి. ఇప్పుడూ జరుగుతున్నాయి. ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించి, సమర శీల పోరాటాలకు నాంది పలికి, స్వతంత్ర్య పోరాటంలో తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ముస్లిం త్యాగధనుల పాత్రను నామమాత్రం చేసే ఈ చిల్లర ప్రయత్నాలు అత్యంత

దుర్మార్గం. కళ్ళకు కట్టుకున్న అసూయా అద్దాలను తొలగించి, సమ దృష్టితో చూసినట్లయితే, భారతావని స్వాతంత్ర్యం కోసం ముస్లింలు చేసిన ధన, ప్రాణ త్యాగాలు స్వాతంత్ర్య చరిత్రలో అనేకం కనిపిస్తాయి. దేశ స్వాతంత్రోద్యమంలో మతోన్మాద శక్తుల పాత్ర శూన్యం. బ్రిటీషోడి శిక్షలకు బెంబేలెత్తి, ఉద్యమంలో పాల్గొనబోమని, భారత్‌కు వ్యతిరేకంగా ఆంగ్లేయులకు అనుకూలంగా పని చేస్తామని మాఫీ పత్రాలు రాసిచ్చిన చరిత్ర వీరిది.

నిజానికి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా మొట్టమొదట గళం విప్పిందీ, గన్ను పట్టిందీ ముస్లింలే. 1750 ల్లోనే షాహ్ వలియుల్లా ముహద్దిస్ దహెల్వీ రహిమహుల్లా, అలీ వర్దీఖాన్‌లు స్వాతంత్రోద్య మానికి బీజం వేశారు. 1757లో బెంగాల్ పాలకుడైన నవాబ్ సిరాజుద్దౌలా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యోద్యమాన్ని ఉధృతం చేశాడు. వర్తకం పేరుతో వచ్చి, పెత్తనం చెయ్యాలని కుట్ర పన్నిన ఆంగ్లేయులను దీటుగా ఎదిరించి, సింహస్వప్నంగా నిలిచాడు. దీంతో బెంబేలెత్తిన బ్రిటిషర్లు ఈ స్వతంత్ర పాలకుని అడ్డు తొలగించుకోవడం కోసం మీర్ జాఫర్ ద్వారా ద్రోహపూరిత కుట్రకు తెర లేపారు. ఫలితంగా సిరాజుద్దౌలా అమరగతి పొందాడు.

తరువాత ఆంగ్లమూక మైసూరుపై దృష్టిపెట్టింది. మైసూరును వశం చేసుకోవాలని మాయోపాయాలు పన్నింది. అప్పటి మైసూరు పాలకుడు సయ్యద్ హైదర్ అలీ అత్యంత ధైర్యస్థైర్యాలు ప్రదర్శిస్తూ ఆంగ్లబలగాలను అడ్డుకున్నాడు. ఈయన మరణం తరువాత, అతని కుమారుడు, వీరశూర పరాక్రమవంతుడైన టిప్పుసుల్తాన్ (1799 ) ఆంగ్లమూకలకు సింహ స్వప్నమై నిలిచాడు. కాని మీర్ జాఫర్ ఆత్మ మీర్ సాదిఖ్‌లో ప్రవేశించిన ఫలితంగా 'టిప్పు' కూడా అమరుడయ్యాడు. బ్రిటిష్ బలగాలతో వీరోచితంగా పోరాడుతూ, రణరంగంలోనే దేశం కోసం ప్రాణాలర్పించిన మొట్టమొదటి దేశభక్తుడిగా టిప్పూచరిత్ర అజరామరంగా నిలిచిపోయింది.

1817లో సయ్యద్ అహ్మద్ షహీద్ (రహ్మ), అల్లామా ఇస్మాయిల్ షహీద్ (ర) గార్లు దేశాన్ని బానిస సంకెళ్ళ నుండి విముక్తి కల్పించ డానికి కంకణ బద్ధులయ్యారు. ఈ యోధులిద్దరూ దేశ స్వాతంత్ర్యం కోసం, ఆంగ్లమూకల బానిసత్వం నుండి దేశానికి విముక్తి కల్పించడం కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతూ 1831లో బాలాకోట్ అనే ప్రాంతంలో అమరగతిని పొందారు.

ఈ ఘటన తరువాత ముస్లిమ్ సమరయోధులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. అయినప్పటికీ వారు స్వాతంత్ర్య కాంక్షలో తమ ధైర్యస్థైర్యాలను ఏ మాత్రం సడలనివ్వలేదు. స్వాతంత్ర్య సాధన సంగ్రామంలోనే తాము అమరగతి పొందాలన్న కోరికతో వారు తమ చివరి శ్వాస వరకూ పోరాడారు. ఇస్లామ్ బోధనల స్ఫూర్తితో 1857లో తిరుగుబాటు ఉద్యమం ఉగ్రరూపం దాల్చింది. స్వాతంత్ర్య కాంక్షతో రగిలిపోతూ స్వేఛ్ఛాపతాకను చేబూని అగ్రభాగంలో నిలిచినవారిలో మౌలానా ఇనాయతుల్లాహ్ సాదిక్ పురి, మౌలానా ఖాసిం నానోత్ వీలు అగ్రగణ్యులు. ఈ త్యాగ ధనులు రగిలించిన స్ఫూర్తితో సాదిక్ పూర్ వీధులు దేశ ప్రేమికులైన అమరవీరుల రుధిరంతో ఎరుపెక్కాయి. చివరికి 1857లోనే ఈ స్వాతంత్ర్య సమర పితామహులు అమరగతుల య్యారు. తరువాత ఈ మహత్తర ఉద్యమ బాధ్యతను మౌలానా అబ్దుల్లాహ్ కసూరి భుజాలకెత్తుకొని, నలభయ్యేళ్ళపాటు అనుపమానమైన రీతిలో బలోపేతం చేస్తూ ముందుకు నడిపించారు.

ఈ విధంగా భారతీయ ముస్లింలు తమ దేశస్వాతంత్ర్యం కోసం ఆంగ్లేయులతో నిరంతరం పోరాడుతూ, దేశమాత బానిస సంకెళ్ళను తునాతునకలు చేసేక్రమంలో తమ సర్వస్వాన్నీ త్యాగం చేయడానికి పరమ సంతోషంగా సిద్ధపడి, అసామాన్యమైన ఆదర్శాలను నెలకొల్పారు. బెంగాల్ మొదలు, కశ్మీరు వరకు విస్తరించిన భూభాగమంతా ముస్లిమ్ సమరయోధుల రుధిరంతో ఎరుపెక్కి పోయింది.

కాని ఆశ్చర్యకర విషయం ఏమిటంటే, దేశ స్వాతంత్ర్యం కోసం తమ సర్వస్వాన్నీ ధారపోసి, ఇన్ని త్యాగాలు చేసిన ముస్లింలు ఈనాడు అనుమానపు దృక్కులతో చూడబడుతున్నారు. సొంతగడ్డపైన్నే పరాయి వారుగా పరిగణించబడుతున్నారు. దేశద్రోహ ముద్రవారి తలపై కత్తిలా వేలాడుతోంది. స్వతంత్ర భారతావనిలో వారి హక్కులు అతి దారుణంగా హరించబడుతు న్నాయి. వారిని విదేశీయులని, విదేశీ ఏజెంట్లనీ నిందించడం జరుగుతోంది. వారిని దేశం విడిచి వెళ్ళమని కూడా బెదిరించడం జరుగుతోంది. ప్రాణాలను ధారపోసి సాధించుకున్న స్వతంత్ర స్వేఛ్ఛా భారతంలో, స్వాతంత్రోద్యమంతో నామమాత్రపు సంబంధం కూడా లేని శక్తులు ముస్లింల దేశభక్తిని శంకించడం అతి పెద్దవిషాదం. ఇటువంటి కారుకూతలకు సమాధానంగా దేశంలోని న్యాయ ప్రేమికులు బలంగా గళం విప్పాలి. ముస్లింలు, న్యాయదృష్టి, భావసారూప్యత కలిగిన ఇతరమేధావి వర్గంతో కలసి నిజమైన చరిత్రను ప్రచారం చెయ్యాలి. కనీసం ముందు తరాలకైనా వాస్తవ చరిత్రను పరిచయం చేయడం ఇప్పుడు మనముందున్న కర్తవ్యం.

# కథ

## షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల



# కరోనా కాటులో...

**కరోనా పోయాక** జన జీవన స్రవంతిలో స్తబ్దత తొలిగి మామూలు స్థితి వచ్చింది. కరోనా కాటేసిన ఎన్నో కుటుంబాలు బిక్కు బిక్కు మంటూ బయటికి వస్తున్నాయి. జాకిర్ గారికి రోజు సాయంత్రం డ్యూటి నుండి వస్తూ ఉదయం ఇల్లాలు చెప్పిన కూరగాయలు తీసుకొని పోవడం ఆనవాయితీ. ఈ మధ్య బురఖాలో ఒక మహిళ కూరగాయలు అమ్మడం జాకిర్ గారు గమనిస్తున్నారు. అప్పుడప్పుడు ఆవిడతో పాటు ఒక మూడేళ్ళ బాబు కూడా అక్కడే ఆడుకుంటూ ఉంటాడు. ముందుగా ఇక్కడ రెండు మూడు కూరగాయల దుకాణాలు ఉండేవి. రైతు బజార్‌కు ఓ ఫర్లాంగు దూరంలో ఇప్పుడు చాలా దుకాణాలు వెలసినాయి. రోడ్డు పేవ్మెంటు పైనా ఉన్న ఈ దుకాణాలు ఎండ వేడిలో, చలిగాలిలో, వర్షంలో అలాగే ఉంటాయి. తరచూ ఈ పేద దుకాణాలపై పోలీస్, మున్సిపల్, రోడ్ అండ్ బిల్డింగ్ అధికారుల హుకుం, జులూం మామూలే! ఓ రోజు కాకతాళీయంగా సెల్ మాట్లాడు కుంటూ జాకిర్ ఆ బురఖా ఆవిడ కూరగాయల అంగడికి వచ్చేసారు. కూరగాయలు ఫ్రెష్‌గా ఉన్నాయి. జాకిర్ గారికి పెద్దగా బేరాలాడే అలవాటు లేదు. అందునా చిన్న షాపుల్లో మరీను. వాళ్ళు చెప్పిన రేటు ఇచ్చేస్తారు. వాళ్ళే కొంత మళ్ళీ రిటర్న్ ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. అలా రోజు కూరగాయ లకు అక్కడికి రావటం అలవాటైన దుకాణంగా మారిపోయింది. జాకిర్ కూరగాయలు కొంటూ అడిగారు, "నాన్న గారు ఏం చేస్తుంటారు, ఎప్పుడూ అగుపించలేదు" అన్నారు. ముందుగా అయితే చెప్పేది కాదేమో, జాకిర్ గారి వయసు, నిజాయితీ గ్రహించిందేమో అసాంతంగా తన జీవిత కథ చెప్పుకొచ్చింది.

జాకిర్ గారు అడగలేదు కాని ఎవరో పిలువగా తెలిసింది, ఆమె పేరు ఖదీజా అని. తన తల్లి చిన్నప్పుడు చనిపోతే తండ్రి తమ అక్కచెల్లెళ్ళకు పదవ తరగతి వరకు చదివించి పెళ్ళిళ్ళు చేసి నాడు, ఖదీజా చెప్పుకొస్తుంది. తనకు ఓ ప్రైవేటు కంపెనీలో పని చేసే షఫీ అనే యువకుడితో, చెల్లెలికి మిలటరీలో పనిచేసే వ్యక్తితో పెండ్లి జరిపించాడు. చెల్లెలు భర్తతో క్షేమంగా జమ్ములో ఉంది. తన సంసారం కొద్దిగా కష్టంగా అయిన బాగానే ఉండేది. తండ్రి తన చెంతనే ఉండేవాడు. కాలం సాగిపోతున్న తరుణంలో తన భర్తను కరోనా కాటేసింది. కళ్ళు తుడుచుకుంటూ చెప్పుకొచ్చింది ఖదీజా, రెండు మూడు రోజుల జ్వరం కొద్దిగా ఆయాసం.. ఆసుపత్రిలో చేర్పించారు. రాత్రి ఉప్మా తినిపించి వచ్చాం, బాగానే ఉన్నాడు. తెల్లారేసరికి చావు కబురు. శవం కూడా ఇవ్వకుండా ఎక్కడో ఖననం చేసేసారు. గద్గద స్వరంతో అంతా అయిపోయింది సార్, అంతా శూన్యం. ముగ్గురు సంతానం ఇద్దరు ఆడపిల్లలు, సంసారం గడువాలి. మా నాన్నగారు నా కష్టాలు చూడలేక పైకి వెళ్ళిపోయారు. మాట్లాడుతూనే మధ్య మధ్య వచ్చిన వ్యాపారం చేస్తుంది. ఎవరన్నా పొరపాటుగా పుచ్చి పోయిన కూరగాయలు వేసుకున్నా తానే ఏరివేస్తుంది, సద్ది సరుకైతె అవి నిన్నటివి అని చెప్పి మరీ ధర తగ్గించి పైకం తీసు కుంటుంది. తూకం చాలా జాగ్రత్తగా వేస్తుంది. జాకిర్ గారు ఖదీజా నిజాయితీ మెచ్చుకున్నారు. అల్లాహ్ వద్ద సమాధానం చెప్పుకోవాలి కదా సార్ అంది మామూలు ధోరణిలో.

ఖదీజా చెప్పుకొస్తుంది, సంసారం గడవడం కష్టంగా ఉండేది. తన తండ్రి ఓ కూరగాయల షాపులో ఉండేవాడు. ఆయన మంచితనం వల్ల ఆ షాపు యజమాని తనకు ఈ షాపు పెట్టించి నాడు. భర్త చనిపోయేటప్పటికి ఓ యాభై వేలు అప్పుండేది. దుకాణంలో వచ్చే ఆదాయం అప్పు తీర్చటానికే సరిపోతుంది

తన బాధలు చెప్పుకుంది. “అల్లాహ్ కరుణామయుడు అన్ని సమస్యలు తీర్చుతాడులే అమ్మా” అంటు జాకిర్ గారు ఉప శమన పలుకులు పలికారు. స్వాతంత్ర్య దినోత్సవం కోసం జాకిర్ తీసుకున్న చిన్న జెండా ఆయన జేబులో నుండి మెరిసే స్టీల్ తిరంగా వైపు మూడేళ్ళ సలీం మాటిమాటికి చూడడం గమనించి అది తీసి వాడి జేబుకు పెట్టేసారు. వాడు సంతోషంగా ఆ చిరు జెండాను చూస్తూ తల్లికి చూపిస్తూ మురిసిపోతున్నాడు. మరుసటి రోజు పట్టణంలో వెలసిన ఖిద్మత్ కోఆరేటివ్ బ్యాంక్ ద్వారా ఖదీజా చేత అకౌంటు ఓపెన్ చేయించి, ఆమె ఋణం తీర్చే ఏర్పాటు చేసారు జాకిర్ గారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా తాము సైతం అంటూ కూరగాయల దూకాణాలపై రెపరెపలాడుతున్న మువ్వన్నెల జెండాలను సిటీబస్సులో పోతూ వస్తూ గర్వంగా చూస్తుంటారు జాకిర్ గారు.

★★★

ముజాహిద్ గారు ఆఫీసు కైనా, మార్కెట్టుకైనా వెళ్ళాలంటే తన ఆక్టివాపై వెంకటేశ్వర పెట్రోల్ బంక్ రోడ్డు మీదుగా వెళుతుం టారు. ఇంటికి దగ్గర కాబట్టి పెట్రోల్ సైతం అక్కడే పట్టిస్తుం టారు. ఒకరోజు తన బావ వస్తున్నారంటే తెల్లవారుజామున నాలుగంటలకే స్కూటీపై బయలుదేరి పెట్రోల్ పోయిద్దాం అని పెట్రోల్ బంక్ దగ్గరికి వెళ్ళారు. పంపు దగ్గర ఏదో పుస్తకం చదువుతున్న అబ్బాయి లేచి వచ్చి ఎంతదీ అంకుల్ అడిగాడు. జీరో చూడండీ అంటూ పెట్రోల్ డ్రాప్ చేసాడు. డబ్బులిస్తు ముజాహిద్ గారు అడిగారు “కొత్తగా వచ్చావా బాబు? ఏం చదువు కున్నావ్?” అని. ఎంటెక్ అంకుల్ అంటు ఛేంజ్ తిరిగి ఇచ్చాడు. తెల్లవారుజాము పైగా గిరాకి లేదు, ముజాహిద్ గారి బావ రావటానికి కూడా టైముంది. ముజాహిద్ మాటలు కలిపారు. బాబూ! ఏదన్నా ఉద్యోగం చూసుకోకపోయావా, ఇక్కడ ఎంతిస్తారు ? మీ నాన్నగారు ఏం చేస్తుంటారు? అంటు విషయం రాబట్టారు.

“గత ఏడాది నాన్న గారు కరోనా వల్ల చనిపోయినారు. నేనొక్కడిని ఐవైయం వాళ్ళతో కలిసి అంతిమ సంస్కార పనులు చేసాను అంకుల్. ఎంటెక్ అయిపోయింది. నాన్న గారు మోటార్ మెకానిక్. దేవుడి దయవల్ల సొంత ఇల్లు ఉంది, కాని నాన్న గారు పెద్దగా సంపా దించింది లేదు. ఇంకా చెల్లి ఉంది, ఇల్లు అమ్మేద్దాం అను కున్నాం కాని ఏదో అప్పులు చేసి అమ్మకు వచ్చే పింఛనుతో సంసారం లాక్కొని వస్తుంది” చెప్పు కొచ్చాడు చక్రధర్. కింద ఉన్న పుస్తకం వైపు చూసారు ముజాహిద్, అది గ్రూప్స్ ప్రిపరేషన్స్ బుక్. ముజాహిద్ సైగ గమనించి ఆ అబ్బాయి చెప్పాడు, అవును అంకుల్ గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నా.... కాలేజి వాళ్ళు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదు, వాళ్ళకు ఓ ముప్పై వేలు ఇవ్వాలి. నేను నైట్ డ్యూటీలు చేస్తున్న అన్నాడు.

ముజాహిద్ బస్టాండుకు వెళ్ళి బావను పిలుచుకొని వచ్చారు. కాని ఆయన ఆలోచనంత పెట్రోల్ బంకులోని అబ్బాయికి సహాయం చేయాలనే. తన దగ్గర బ్యాంక్‌లో మూడు లక్షలు పైగా అమౌంటు ఉంది, ఏదో ఆ అబ్బాయిలో నిజాయితీ ఉంది, కాలేజిలోని సర్టిఫికెట్స్ కోసం ముప్పై వేలు ఇద్దాం అని ముజాహిద్ గారు డిసైడ్ అయ్యారు. చక్రధర్‌ను కలిసి ముప్పై వేలు ఫోన్ పేలో వేస్తాను. కాలేజిలో సర్టిఫికెట్స్ తీసుకో అంటే, ఒద్దు అంకుల్ నేను మీకు పెద్దగా పరిచయం లేదు, వద్దులేండి అంటున్నాడు. చూడు బాబు అప్పుగా ఉంచు, నీకు ఉద్యోగం వచ్చినప్పుడే ఇద్దువుగాని అంటూ ఆ అబ్బాయి అకౌంట్‌కు ముప్పై వేలు ట్రాన్స్‌ఫర్ చేసారు. ఆ అబ్బాయి, ముజాహిద్ గారి చేతులు పట్టుకొని థ్యాంక్స్ అంటూ పలుమార్లు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

ఆ అబ్బాయికి అగుపిస్తే గుర్తు చేసినట్లు ఉంటుందని ముజా హిద్ గారు టైమ్ తప్పించి వచ్చి పెట్రోల్ బండికి పట్టించుకొని వెళ్ళేవారు. బాధ్యత అన్నట్టు చక్రధర్ రెండు మూడు సార్లు థ్యాంక్స్ చెప్పినాడు. ఓ సారి ఆ అబ్బాయి తన అమ్మతో కూడా మాట్లాడించాడు. నెల రోజుల తరువాత సాయంత్రం ముజాహిద్ గారు అసర్ నమాజుకు వెళ్దామని సిద్ధం అవుతుంటే ఆ అబ్బాయి వాళ్ళ అమ్మను పిలుచుకుని స్వీట్ పాకెట్‌తో వచ్చాడు. “ఇప్పుడే మెయిల్ వచ్చింది అంకుల్! గ్రూప్స్‌లో డిఎస్పీగా సెలెక్ట్ అయ్యా నని, ముందు మీ దగ్గరికే వచ్చాను అంకుల్” అంటూ కంటి నీరు తుడుచుకున్నాడు. అవి ఆనందభాష్పాలు అంటు ముజా హిద్ గారు చక్రధర్‌ను గుండెకు హత్తుకున్నారు. తన సహాయం సార్థకం అయిందని దైవానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. దగ్గరి మస్జిద్ నుండి అల్లాహు అక్బర్... అల్లాహ్ గొప్పవాడు అన్న పిలుపు సాక్ష్యంగా నిలిచింది. ✤


అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతహూ !

సోదర సోదరీమణులకు మా ఆత్మీయ ఆహ్వానం
హజ్-ఉమ్రా యాత్రలకు మా ద్వారా ప్రయాణించండి.

AL-FURQAN HAJ-UMRAH SERVICE

అల్ ఫుర్ఖాన్
హజ్ ఉమ్రా సర్వీస్

ఫారూఖ్ నగర్ మసీదు దగ్గర బందరు రోడ్డు, విజయవాడ - 7

9666197766, 9494115561



# 'జన భారత్'... 'జయ భారత్'

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ

**కోయిల** తన భాష తను మాట్లాడుతుంది. అందుకే స్వేచ్ఛగా విహరిస్తుంది. అదే చిలుక అయితే ఇతరుల పలుకుల్ని వల్లిస్తుంది. అందుకే అది స్వేచ్ఛ కోల్పోయి పంజరంలో ఉండాల్సి వస్తుంది. బందీ అయిపోతుంది. ఎవరి భాషను వారు మాట్లాడుతూ ఎవరి ఆలోచనా విధానాన్ని వారు కాపాడుకుంటూ, ఎవరైతే ఆత్మ విశ్వాసంతో ఉంటారో వారే ముందుకు పోతారు. నిజం మాట్లాడేవారు కష్టాల పాలవుతారేమో గానీ, పరాజితులు కారు. బానిసలుగా మిగలరు.

చెట్టపట్టాల్ పట్టుకుని
దేశస్థులందరు నడువ వలెనోయ్
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నియు మెలగవలెనోయ్ !

గురజాడ వారు రాసిన గీతంలోని ఈ చరణాలు నాటి భారతీయ సంస్కర్తలు, మేధావుల ఆకాంక్షనే గాక ఆలోచనా రీతిని తెలియ జేస్తాయి. వందలాది మతాలు, జాతులు, భాషలు గల ఈ దేశం కలసి కట్టుగానే ముందుకు సాగాలని వారు స్పష్టంగా గుర్తించారు. సామాన్యుల నుంచి సామ్రాట్టుల వరకూ ప్రగాఢమైన మత విశ్వాసాలు ఎప్పుడూ వున్నాయి. వాటి ప్రభావమూ వుంది. అయినా 'ఏ మతమైనా బోధించదుగా ద్వేషాన్ని రూపుదిద్దుదాం భిన్నత్వంలో ఏకత్వాన్ని' అన్న అల్లామా ఇక్బాల్ వారి మాట స్ఫూర్తిగా ముందుకు సాగాలి.

'దేశమంటే సామాన్యులు! సామాన్యుల విద్య, వికాసాలపైన, సాంస్కృతిక పునరుజ్జీవనం పైన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ప్రజాచైతన్యం ద్వారానే ప్రజాస్వామ్యం బలపడు తుంది'. గ్రుండ్‌విగ్, (ఫోక్ స్కూల్ రూపకర్త: డెన్మార్క్) మాట ద్వారా మనం తెలుసుకోవాల్సిన సారాంశం ఏమిటంటే... మనుషుల్ని చంపి, మతాన్ని బతికిస్తామనే రోజులు పోయి, మనుషుల్ని చంపే మతాన్ని నాశనం చేసి, మానవత్వాన్ని నిలబెడ దామనే అచ్ఛే దిన్ రావాలి!

బహుళ జాతి దేశాన్ని ఏకతాటిపై నిలిపేందుకు మతం సరిపోదని స్వాతంత్ర్య ఉద్యమం కూడా సరిగ్గానే గ్రహించింది. ప్రతి మతాన్ని దేశ భవిష్యత్తులో భాగస్వామ్యం చేస్తేనే భారతదేశం లాంటి పెద్ద దేశం, వైవిధ్యభరిత దేశం, ఒక దేశంగా కలిసి ఉండగలదని మన పూర్వీకులు వారి అవగాహనలో ఖచ్చితంగానే ఉన్నారు. శాంతి, స్థిరత్వానికి సంబంధించి, ఎన్ని ఒత్తిళ్ళు ఎదురైనా, 1947 నుండి భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా కొనసాగిందంటే లౌకిక వాదం పట్ల మనకున్న నిబద్ధతే కారణమనేది వాస్తవం. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు కలిసి పోరాడారని మనం గుర్తుంచుకోవాలి. 1857లో భారతదేశ మొదటి స్వాతంత్ర్య సమరానికి నానా సాహిబ్, బహదూర్ షా జఫర్, మౌల్వీ అహ్మద్ షా, తాంతియా తోపే, ఖాన్ బహదూర్ ఖాన్, రాణి లక్ష్మీబాయి, హజ్రత్ మహల్, అజీముల్లా ఖాన్, ఫేరోజ్ షా వంటి నాయకులు సంయుక్తంగా

నాయకత్వం వహించారు. హిందువులు, ముస్లిములు కలిసి అత్యున్నత త్యాగం చేసిన సందర్భాలతో మన చరిత్ర నిండి ఉంది. అయోధ్య నేడు మతపరమైన ముఖ్య కేంద్రంగా మారినప్పటికీ, నాడు, 1857లో అయోధ్యలోని ప్రముఖ మౌల్వీ మౌలానా అమీర్ అలీ, సుప్రసిద్ధ హనుమాన్ ఆలయానికి చెందిన బాబా రామ్‌చరణ్ దాస్ కలిసి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ ప్రతిఘటనను నిర్వహించడంలో నాయకత్వం వహించడం ఆసక్తికరంగా ఉంటుంది. ఆ కారణంగా వారిద్దరినీ పట్టుకుని ఒకేసారి అయోధ్యలోని ఫైజాబాద్ జైలులో ఉన్న కుబేర్ టీలా వద్ద చింత చెట్టుకు ఉరితీశారు.

భారతదేశం నేడు అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. అదుపు లేని ధరలు, రెక్క లొచ్చిన ద్రవ్యోల్బణం, పాతాళానికి... డబ్బు విలువ, ఆరుగాలం శ్రమించి పంట బకాయిల కోసం చకోర పక్షుల్లా హాలికులు, నిరసన హక్కు, తీవ్రవాద కార్యకలాపాల మధ్య రేఖ మసకబారి హక్కులకై పోరాడే శ్రామికులపై తప్పుడు కేసులు, కాలం చెల్లిన చట్టాలతో రాజద్రోహాలు చేతులకు సంకెళ్లు వేసి గొంతులను సమాధి చేసే రాజ్య క్రూరత్వానికి బలవుతున్న పోరాటయోధులు ఉద్యోగుల, కార్మికుల నిరసనలపై ఆర్డినెన్సులు సృజనాత్మకతపై దాడి అధ్యక్ష తరహా పాలన సాగించే అత్యున్నత కార్యాలయాలు గ్రామ పంచాయితీల హక్కులు కాలరాసే ప్రభుత్వాలు ఒక్కటేమిటి పాలన అస్తవ్యస్తం వ్యవస్థల తీరు చూసి నిస్సహాయ స్థితిలో ఓ తరం ఇదే...ఇదే నేటి భారతం.

వాహనానికి ఇంధనం... దేహానికి రుధిరం ఎలాగో... దేశానికి యువతరం అలాగ. అందుకే అంటాడో కవి... 'యువతరం శిరమెత్తితే/ నవతరం గళమెత్తితే/ లోకమే మారిపోదా/ చీకటే మాసిపోదా...' అని. ఇలాంటివారిని ఉద్దేశించి... 'కొంత మంది యువకులు రా/ బోవు యుగం దూతలు/ పావన నవజీవన బృందావన నిర్మాతలు' అంటాడు శ్రీశ్రీ. లక్ష్యాన్ని సాధించడంలో చెరసాలలు, ఉరికొయ్యలకు సైతం ఎదురు నిలుస్తారు. నవ సమాజానికి బాటలు వేస్తారు. 'మాకు గోడలు లేవు/ గోడలను పగులగొట్టడమే మా పని' అంటూ ముందుకు సాగుతారు వీరు. నిజానికి యువత అంత శక్తిమంతమైనది. నవ సమాజ స్థాపన అయినా... జాతిహిత నిర్మాణమైనా యువశక్తితోనే సాధ్యం. దేశ సంపద, భవితకు పునాది... యువత. ఏ దేశ పురోగమనంలోనైనా యువతరానిదే కీలకపాత్ర. 'ఇంక్విలాబ్ జిందాబాద్' అని దేశాన్ని కదిలించిన భగత్‌సింగ్ 23 ఏళ్ల వయస్సులో... 'జై హింద్..! అంటూ జన సామాన్యాన్ని సయితం చైతన్యబాటలో కదిలించిన యువ కిశోరాలు ఎందరో 20 నుండి 30 సంవత్సరాల లోపే... స్ఫూర్తిదాయకమైన పాత్ర నిర్వహించారు. చెక్కుచెదరని ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా యువత ఉన్నప్పుడే ఏ జాతి భవిష్యత్తయినా ఉజ్వలంగా వెలుగొందుతుంది.

గుండెల నిండా చేవ, కండరాల నిండా సత్తువ నిండియున్న యువత ఎక్కువగా వున్న దేశం మనది. ఉత్తేజంలోనూ, ఉత్పత్తిలోనూ, ముందుండాల్సిన దేశం మనది. దేశంలో నేడు ఆ రకమైన ఉత్పత్తి జరగడం లేదు. యువతలో ఆ ఉత్తేజమూ లేదు. పాలకుల వైఫల్యాల కారణంగా యువతలో శక్తిసామర్థ్యాలు ఉడిగిపోతున్న పరిస్థితి. దీనికి తోడు... దేశంలో వ్యాపింపజేస్తున్న సాంస్కృతిక కాలుష్యం కూడా యువతను పెడితోవ పట్టిస్తోంది.

భారతదేశంలో రోజురోజుకూ మతపరమైన ఏకీకరణ తీవ్రమవుతోంది. రణమా, శరణమా? అని కొందరంటే, శివం లేదా శవం అన్నది మరికొందరి నినాదం. భారతదేశంలోని మైనారిటీలపై ప్రత్యేకించి ముస్లిం సమాజంపై ద్వేషపూరిత వాతావరణాన్ని వెదజల్లుతున్నారు. హింస, హింసను పుట్టిస్తుంది. కాబట్టి, పాలస్తీనియన్ల డొమిసైడ్ (ఇళ్లను ధ్వంసం చేయడం) లాంటి ఇజ్రాయిల్ విధానంలాగా మైనారిటీ కమ్యూనిటీకి చెందిన నిరసనకారులను త్వరితగతిన అణగ తొక్కటానికి, శిక్షించటానికి 'బుల్డోజర్' ఒక కొత్త సాధనంగా ఉద్భవించింది. 1984లో ఇందిరా గాంధీ హత్య తరువాత కూడా ఇదే వ్యూహాన్ని ఉపయోగించిన విషయాన్ని గమనించాలి. కానీ అప్పుడు దాన్ని మానవ సంహారం అన్నాం. ఇప్పుడు దీన్ని గుణపాఠం నేర్పడం అంటున్నారు.

భారతీయ సమాజం పురోగతి చెందాలంటే ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం, తీవ్రమైన ఆర్థిక అసమానతలు, పేదరికం లాంటి సమస్యల పరిష్కారం కోసం తక్షణం శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. మతపరంగా ప్రజలను సంఘటితం చేయడం ద్వారా... నిజ జీవిత సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్ళించటానికి ఉద్దేశపూర్వక ప్రయత్నం జరుగుతోంది. ఈ సమస్యల పరిష్కారానికి ప్రజల మధ్య సఖ్యత, ఐక్యత అవసరం. ఒక వైపు భారతీయుల మధ్య ఐక్యతకు భంగం కలిగిస్తూ, మరో వైపు భారత దేశ సమగ్రతను కాపాడాలని, భారత దేశాన్ని విశ్వ గురువుగా నిలబెట్టాలని ఏ దేశాభిమాని అయినా ఎలా ఆలోచించ గలడు?

'సుస్థిర సంకల్పాల వెన్నుపూసలు/ ఎదురు దెబ్బలకు/ ఏ మాత్రం వంగిపోవు' అంటూ... నిరాశపై యుద్ధం చేయాలంటారు డా: సినారె. ఈ దేశం కోసం ప్రాణాలర్పించిన ఎందరో యువకిశోరాలు రగిలించిన స్ఫూర్తిని అణువణువునా నింపుకోవాలి మనం. సృజనను చంపేసే వృద్ధాప్యం నింపిన సమాజంలో నవయవ్వనం చిగురించేలా 'కొంతమంది కుర్రవాళ్లు పుట్టుకతో వృద్ధులు' కాదు-రాబోవు యుగం దూతలు/ పావన నవజీవన బృందావన నిర్మాతలు' అని నిరూపించాలి. ప్రపంచంలో ప్రథమ స్థానానికి పరుగులు తీస్తూ 'జన భారత్' అనిపించుకుంటున్న మనం అదే నోట 'జయ భారత్' అనిపించుకొనే రోజూ రావాలి! మన దేశానికి ఇప్పుడదే కావాలి!!

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

85 ఆయత్‌లు

# 40. అల్ మూ'మిన్

మక్కా అవతరణ

61 – 63 ఆయనే కదా అల్లాహ్, మీ కొరకు రేయిని సృజించినవాడు, మీరు అందులో నెమ్మదిని పొందాలని, మరి పగలును ప్రకాశమానం చేసినవాడు. అల్లాహ్ మాత్రమే వాస్తవానికి జనుల ఎడల ఎంతో అనుగ్రహం గలవాడు, కాని చాలామంది కృతజ్ఞత చూపరు.[85] ఆ అల్లాహ్ (మీ కొరకు ఇదంతా చేసినవాడు) మాత్రమే మీ ప్రభువు. ప్రతిదీ సృష్టించినవాడు. ఆయన తప్ప మరే ఆరాధ్యుడూ లేడు.[86] మరలాంటప్పుడు మీరు ఎటువైపున దారి తప్పించబడుతున్నారు?[87] ఇదే విధంగా అల్లాహ్ వచనాలను తిరస్కరిస్తూ ఉండేవారంతా పెడదారి పట్టించబడుతూ వచ్చారు.[88]

85. ఈ ఆయత్‌లో రెండు ముఖ్యమయిన విషయాలున్నాయి. మొదటిది, ఇందులో రేయినీ పగలునూ దేవుని ఏకత్వానికి నిదర్శనంగా పేర్కొనడం జరిగింది. అవి నియమబద్ధంగా రావడం వల్ల తేటతెల్లమయ్యే భావం, సూర్యుడిపైనా భూమి పైన ఒకే దైవం పరిపాలన సాగుతోందన్నది. ఆ రెంటిలో మార్పులు జరగటం వల్ల భువిలో మానవుడూ ఇతర సృష్టిరాశులకు కలిగే ప్రయోజనం ద్వారా ఆ ఒక్క దైవమే ఈ సమస్త పదార్థాల సృష్టికర్త అనీ తేలిపోతుంది. ఆయన ఈ వ్యవస్థను ఉన్నతస్థాయి విజ్ఞతతో నిర్మించాడు, దీనివల్ల ఆయన పుట్టించిన సృష్టితాలన్నింటికీ ప్రయోజనకరం అయ్యేలా తీర్చిదిద్దాడు. రెండవది, ఇందులో దైవాన్ని తిరస్కరించే, దైవంతోపాటు సహవర్తులను కల్పించే మనుషులకు, స్పృహ కలిగించడం జరిగింది దైవం రేయీ పగళ్ళ రూపంలో ఎంత మహత్తరమయిన వరప్రసాదాన్ని వారికి బహూకరించాడో, ఆయన అనుగ్రహించిన ఈ వరప్రసాదం వల్ల ప్రయోజనం పొందుతూ వారు ఆయన పట్ల ఎంత విద్రోహానికీ అపనమ్మకానికీ పాల్పడుతూ ఉన్నారో, ఇది ఎంత హీనమయిన కృతఘ్నుతో వారికి ఎత్తి చూపడం జరిగింది. (మరిన్ని వివరాలకు చూడండి, ఖుర్ఆన్ అవగాహనం, సం.3, యూనుస్: పాద సూచి 65 సం.5, అల్ ఫుర్ఖాన్: పాద సూచి 77 అన్ నమ్ల్ : పాద సూచి 104 సం.6, అర్ రూమ్: పాద సూచి 33 లుక్మాన్ : 29 పాదసూచి 50 సం.7, యాసీన్ : 37, పాద సూచి 32).

86. అంటే రేయీ పగలూ మారి మారి రావడం వల్ల ఆయనే మీకూ సర్వ సృష్టిరాశులకూ కర్త అన్న విషయం తేలిపోయింది. ఈ మార్పు మీ జీవితానికి అందజేసే మహత్తరమయిన ప్రయోజనాల వల్ల ఆయన మీ పట్ల ఎంతో దయగల ప్రభువు అన్న విషయమూ రుజువయింది. దీని తరువాత మరో మార్గం లేకుండా, మీకు నిజమయిన ఆరాధ్యుడూ ఆయనే అన్న విషయమూ దానంతట అదే నిరూపితమయిపోతుంది. పోతే, ఇది నిజానికి బుద్ధికందని, న్యాయం అంగీకరించని విషయం, మీ సృష్టికర్త అయితే అల్లాహ్, ఆయనే పోషణకర్త, ప్రభువయి ఉండగా ఇతరులు మీ ఆరాధ్యులవుతారా!

87. అంటే, మీకు ఈ తప్పుడు బోధనలు చేస్తున్నదెవరు, మీ సృష్టికర్త కానివారు, పోషణకర్త కానివారు మీ ఆరాధనకు అర్హులని దారి తప్పిస్తున్నదెవరు?

88. అంటే, సర్వకాలాల్లోనూ జన సామాన్యం ఈ దారి తప్పించేవారి మోసానికి లోనవడానికి కారణం అల్లాహ్ తన ప్రవక్తల ద్వారా యదార్థాన్ని బోధించడానికి అవతరింపజేసిన ఆయత్‌లను జనులు నమ్మకపోవడమే. ఫలితంగా వారు ఈ స్వార్థపరులయిన వంచకుల వలలో చిక్కుకుంటారు. వీరేమో మరి తమ అంగడి మెరవాలని బూటకపు దేవుళ్ళ ఆస్థానాలు నిర్మించుకుని కూర్చుంటారు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (4వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

## 1. సాక్ష్యాధారాల ప్రకరణం

అధ్యాయం : 15

## ఇఫ్క్ (అపనింద) సంఘటన
## స్త్రీలు పరస్పరం ఒండొకరిలోని మంచిని గురించి సాక్ష్యమివ్వటం

**(25వ హదీసు గత సంచిక తరువాయి)**

హజ్రత్ అలీ (రజి) ఇలా అన్నారు- 'దైవప్రవక్తా! అల్లాహ్ మీపై ఎలాంటి ఇబ్బంది (ఆంక్ష)నీ ఉంచలేదు. ఆమె కాకపోతే చాలా మంది స్త్రీలు ఉన్నారు. బానిస స్త్రీని కూడా మీరు విచారించండి. నిజమేమిటో ఆమె మీకు చెబుతుంది'. అందువల్ల దైవప్రవక్త(సఅసం) బరీరా (ర.అ)ను పిలిపించారు. (బరీరా హజ్రత్ ఆయిషా-ర.జి గారి ప్రత్యేక సేవకురాలు). "బరీరా! ఒక విషయం చెప్పు. ఆయిషా(ర.అ) శీలాన్ని శంకించే వస్తువు ఏదయినా నీవు ఆమెలో గమనించావా?" అని అడిగినప్పుడు, ఆమె ఇలా సమాధానమిచ్చింది: 'మిమ్మల్ని సత్యం ఇచ్చి ప్రభవింపజేసిన వాని సాక్షిగా చెబుతున్నాను. నేను ఆమెలో లోపాన్ని ఎంచే విషయమేదీ చూడలేదు. కాకపోతే చిన్నపిల్ల. పిండి నానబెట్టి నిద్రలోకి జారుకుంటుంది. అంతలో మేక వచ్చి ఆ పిండి తినేసిపోతుంది. అంతే[2]. దైవప్రవక్త(సఅసం) ఆ రోజు (వేదికపై) నిలబడి, అబ్దుల్లాహ్ బిన్ ఉబై విషయంలో తనకు సహాయం చేయమని కోరారు- "ఏ వ్యక్తి వేధింపులు, ఆగడాల పరంపర ఇప్పుడు నా సతీమణి వరకూ చేరిందో అతని వ్యవహారంలో నాకు తోడ్పడే వారెవరు? అల్లాహ్ సాక్షి! నా భార్యలో మంచి తప్ప మరొకటేదీ నాకు తెలీదు. అదీగాక ఈ రొంపిలోకి అతను ఎలాంటి వ్యక్తిని లాగాడంటే, అతను సౌశీల్యానికి ప్రతిరూపం. ఆ వ్యక్తిలో నేను మంచి తప్ప మరొకటి ఏదీ చూడలేదు" అన్నారు. (ఇది విని) సాద్ బిన్ ముఆజ్(రజి) లేచి నిలబడి, 'దైవ ప్రవక్తా! దైవసాక్షిగా! ఈ వ్యవహారంలో నేను మీకు సహాయకునిగా ఉన్నాను. ఒకవేళ ఆ వ్యక్తి (అభాండం మోపినవాడు) ఔస్ తెగకు చెందినవాడై ఉంటే, మేము అతని మెడ నరికివేస్తాము (సాద్ ఔస్ తెగ నాయకుడు). ఒకవేళ అతను ఖజ్రజ్ తెగకు చెందినవాడై ఉంటే, మేం ఏం చేయాలో తమరు ఆజ్ఞాపించండి. మీరు చెప్పినట్లే చేస్తాము'. ఈ మాట వినగానే ఖజ్రజ్ తెగ నాయకుడైన సాద్ బిన్ ఉబాదా (రజి) లేచి నిలబడ్డారు. నిజానికి ఆయన చాలా మంచివారు. కాని ఆ క్షణంలో (సాద్ బిన్ ముఆజ్ నోట వెలువడిన మాట వినగానే) ఒక్క సారిగా ఆయనలోని- అజ్ఞాన కాలంనాటి- పౌరుషం పురి విప్పింది. ఆగ్రహావేశంతో (సాద్ బిన్ ముఆజ్‌ని ఉద్దేశించి) 'ఎప్పటికీ మిగిలి ఉండే ప్రభువు సాక్షిగా! నీవు కేవలం బొంకుతున్నావు. నీవు అతన్ని చంపలేవు. అది నీ వల్ల అయ్యే పని కూడా కాదు'[3] అన్నారు. అంతలో (సాద్ బిన్ ముఆజ్- రజి- బాబాయి కొడుకు) ఉసైద్ బిన్ హుజైర్(రజి) చివాలున లేచి, 'దైవసాక్షి! మేమతన్ని చంపి తీరుతాము. నీవు కూడా కపటివే. ఎందుకంటే నువ్వు కపటుల తరఫున వకాల్తా పుచ్చుకుంటున్నావు' అని చెప్పారు. అంతే. మాటా మాటా పెరిగింది. ఔస్- ఖజ్రజ్ తెగలకు చెందిన వారంతా నిలబడి పరస్పరం తలపడే పరిస్థితి ఏర్పడింది. వేదికపైనుండి ఇదంతా గమనిస్తున్న దైవప్రవక్త(సఅసం) వేదిక దిగివచ్చి అందరినీ శాంతపరిచారు. అందరూ మౌనం వహించారు. దైవప్రవక్త(సఅసం) కూడా నిశ్శబ్దంగా ఉండిపోయారు. నేను ఆ రోజు కూడా అదే పనిగా ఏడ్చాను. నా కన్నీటి ప్రవాహం ఆగలేదు. నిద్ర

కూడా పట్టలేదు. అంతలో మా అమ్మానాన్నలు నా దగ్గరకు వచ్చారు. ఒక పగలు ఒక రాత్రి నిరాఘాటంగా ఏడుస్తూ గడిపాను. అలా ఏడ్చి ఏడ్చి నా హృదయం ముక్కచెక్కలయి పోతుందేమోననిపించింది. నా తల్లిదండ్రులు నా దగ్గర కూర్చుని ఉండగానే ఒక అన్సార్ మహిళ లోనికి వచ్చేందుకు అనుమతి కోరింది. నేనామెకు అనుమతి ఇచ్చాను. ఆమె కూడా నాతోపాటే కూర్చుని దుఃఖంతో విలపించసాగింది. మేము ఆ స్థితిలో ఉండగానే దైవప్రవక్త(సఅసం) లోనికి వచ్చి కూర్చున్నారు. ఏ రోజు నుంచి నా గురించి ఎన్నడూ చెప్పుకోని మాటలు చెప్పుకుంటున్నారో, ఆ రోజు నుంచి ఆయన(స) నా దగ్గర కూర్చోవటం అదే మొదటిసారి. ఆయన (స) నెలరోజుల వరకూ నిరీక్షించారు. కాని ఈ వ్యవహారంలో ఆయన(స)పై దైవవాణి (వహీ) అవతరించలేదు. ఆయిషా ఇలా అంటున్నారు: ఆయన(సఅసం) 'తషహ్హుద్' పఠించిన మీదట ఇలా అన్నారు: "ఆయిషా! నీ గురించి నేను ఈ మాటలు విన్నాను. నీవు గనక ఈ వ్యవహారంలో నిర్దోషివి అయివుంటే అల్లాహ్ కూడా నీ నిర్దోషిత్వాన్ని తప్పక బహిర్గతం చేస్తాడు. ఒకవేళ నీవు గనక తప్పు చేసి వుంటే, క్షమాపణకై అల్లాహ్‌ను అర్థించు. ఆయన సన్నిధిలో పశ్చాత్తాపపడు. దాసుడు తప్పు చేసిన మీదట, తప్పును ఒప్పుకుని పశ్చాత్తాపపడితే, అల్లాహ్ కూడా అతని పశ్చాత్తాపాన్ని ఆమోదిస్తాడు." ఆయన (సఅసం) తన సంభాషణను ముగించిన తరువాత నా కళ్ళల్లోని కన్నీరు కూడా పూర్తిగా ఇంకిపోయింది. ఒక్క చుక్క కన్నీరు కూడా రాదనిపించింది. 'నా గురించి దైవప్రవక్త(స)కు మీరైనా చెప్పండి' అని మా నాన్న గారితో అన్నాను. కాని ఆయన ఇలా అన్నారు: 'అల్లాహ్ తోడు! ఇప్పుడు నేను దైవప్రవక్త(స)కు ఏం చెప్పాలో అర్థం కావటం లేదు.' 'అమ్మా! కనీసం నువ్వయినా దైవప్రవక్త(సఅసం) మాటలకు సమాధానం ఇవ్వు' అని ప్రాధేయపడ్డాను. కాని అమ్మ కూడా అదే మాట అంది– 'దైవసాక్షి! దైవప్రవక్త(స)కు ఏం చెప్పాలో నాకు తోచటం లేదు' అని. అప్పటికి నేను టీనేజీలోనే ఉన్నాను. నాకు ఖుర్‌ఆన్ ఎక్కువగా కంఠస్థం అవలేదు. నేనిలా అన్నాను : 'అల్లాహ్ సాక్షి! మీరు కూడా జనుల ద్వారా వ్యాపింపజేయబడిన వదంతుల్ని విని వాటిని ధ్రువపరుస్తున్నారని నాకనిపిస్తోంది. ఒకవేళ ఈ సమయంలో నేను ఏ పాపం ఎరుగని నిర్దోషినని, ఈ అపవాదుతో నాకెలాంటి సంబంధంలేదని నేను చెప్పినా–నేను నిర్దోషినన్న సంగతి అల్లాహ్‌కు బాగా తెలుసు– మీరు నా మాటను నమ్మరు. కాని నేను గనక ఈ వ్యవహారానికి (పాపానికి) నేనే బాధ్యురాలినని అంటే మాత్రం– నేనేపాపం ఎరుగనన్న సంగతి అల్లాహ్ ఎరుగు– మీరంతా దానిని ధ్రువపరుస్తారు. అల్లాహ్ సాక్షి! నేను ఈ సమయంలో నా ఉపమానాన్ని, మీ ఉపమానాన్ని హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) తండ్రి (యాఖూబ్– అలైహిస్సలాం) ఉపమానంలా భావిస్తున్నాను.[4] ఆ సమయంలో ఆయన, "సరే ఓపిక పడతాను. ఉత్తమ రీతిలో ఓపిక పడతాను. మీరు కల్పిస్తున్న మాటలపై సహాయం కొరకు అల్లాహ్‌నే అర్థించాలి" (యూసుఫ్– 18) అని వేడుకున్నారు. ఆ తరువాత నేను పడకపై మరో వైపునకు తిరిగి పడుకున్నాను. అల్లాహ్ స్వయంగా నా నిర్దోషిత్వాన్ని ప్రకటిస్తాడన్న ఆశ నాకుండేది. అయితే నా వ్యవహారంలో అల్లాహ్ 'వహీ' (దైవవాణిని, ఖుర్‌ఆన్ ఆయత్‌లను) అవతరింపజేస్తాడని మాత్రం నేను ఊహించలేదు.

**(మిగతా వచ్చే సంచికలో)**

25-2. హజ్రత్ బరీరా (ర.అ) ఒక బానిస స్త్రీ అయి వుండి కూడా, యజమానురాలి క్యారెక్టర్ గురించి అడిగినప్పుడు ఆమె ఎంతో విజ్ఞతతో కూడుకున్న సమాధానం ఇచ్చింది. ఒకవైపు ఆయిషా(ర.అ)లోని సౌశీల్యాన్ని గురించి సాక్ష్యమిస్తూనే, దైనందిన పనులలో ఆమె వల్ల జరిగే అశ్రద్ధ గురించి కూడా ప్రస్తావించింది. చిన్న పిల్ల అయినందున ఇంటి పనుల విషయంలో తగు శ్రద్ధ చూపటం లేదని చెప్పింది.

25-3. సాద్ బిన్ ఉబాదా (రజి)లోని చిత్తశుద్ధిని ఎవరూ శంకించలేరు. కాకపోతే ఆ క్షణంలో ఆయన అపోహకు గురయ్యారు. అజ్ఞాన కాలం నాటి వర్గ తెగల దురభిమానం ఆయనలో ఒక్కసారిగా జాగృతం అయింది.

25-4. అమ్మ ఆయిషా(ర.అ) అప్పటికి పిన్న వయస్కురాలే. అయితేనేమి, ఆమె సమయోచితంగా స్పందించారు. ఔచితీ విజ్ఞతలు ఉట్టిపడేలా సమాధానమిచ్చి, పాండిత్యంలో తాను ఎవరికీ తీసిపోనని నిరూపించుకున్నారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న దానికి ఇది తార్కాణం.



# తల్లిదండ్రుల బాధ్యత

- పోలంకి విజయభాస్కర్

ఏ వ్యక్తికైనా తల్లిదండ్రులే తొలి గురువులు. వారి ఆలనా పాలనా లోనే వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. పెద్దల పట్ల గౌరవం, ప్రేమ, సహకారం, సానుభూతి, కరుణ  వంటి విలువలతో తల్లిదండ్రులు మెలగాలి. అప్పుడే పిల్లలు వారిని అనుకరిస్తారు, అనుసరిస్తారు. ముఖ్యంగా పిల్లల్ని ఉత్తమమైన పౌరులుగా పెంచాలి. అదే తల్లిదండ్రుల లక్ష్యం కావాలి. నిజం చెప్పాలంటే చాలా మందికి పిల్లలను ఎలా పెంచాలో తెలియడం లేదు. అది ఎవరో చదువులేని వారి విషయం కాదు, బాగా డబ్బుండి, తెలివి ఉండి బాగా చదువు ఉన్నవారు కూడా పుత్ర ప్రేమలో పడి వారి  జీవితాలను సర్వనాశనం చేస్తున్నారు. ఇది వారూ వీరూ అని కాదు, అంతటా జరుగుతోంది. కన్న తీపి అన్నది ప్రపంచంలో అన్నింటికంటే ఎక్కువ తీయనిది. ఇక అది మత్తుగా ఉంటుంది. కళ్ళకు మరేమీ కనబడదు, తప్పు చేసినా మా పిల్లలే గొప్ప అనుకునేంతగా... తత్ఫలితంగా తాము బిడ్డలకు మేలు చేస్తు న్నామా లేక చేటు చేస్తున్నామా అన్నది కూడా ఆలోచన ఉండడం లేదు. ఏ తండ్రి అయినా తనకంటే తన బిడ్డ మరింతగా ఎదగా లనే కోరుకుంటాడు.

పిల్లల  విద్యాభ్యాసంలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమైనది. పిల్లల ఆసక్తికి అనుగుణంగా వారి మనోభావాలను గుర్తించి చదివించడం తల్లిదండ్రుల బాధ్యత. అప్పుడే పిల్లల మానసిక ఎదుగుదల జరుగుతుంది. కష్టపడి చదవడం కన్నా ఇష్టపడి చదివితే ఫలితాలు ఎక్కువగా ఉంటాయనే అవగాహనను కలిగించాలి. నేటి సమాజంలో చూస్తే తల్లిదండ్రులు ఇద్దరూ బాగా చదువుకున్నవారు  ఉంటున్నారు. వారు  ఉన్నత స్థానంలో ఉంటున్నారు, దాంతో తమ సంపదను అంతా బిడ్డలకు ఇచ్చి వారిని ఏమీ కాకుండా చేస్తున్నారు. ఫలితంగా వారు తమకు కూడా కాకుండా పోతున్నారు, అనవసర వ్యసనాలకు లోనవుతున్నారు. మత్తుగా చిత్తుగా మారి చివరకు జీవితాలను కోల్పోతున్నారు.

సిటీలలో పబ్ కల్చర్ పెరిగింది. యువత వీటిని తమ నాగరికతగా భావిస్తున్నారు. పెద్ద మొత్తంలో జీతాలు తీసుకుంటున్న యువత వారాంతపు పని ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం పబ్‌ల వైపు దారి తీస్తున్నారు. మత్తును కూడా కోరకుండానే ఆహ్వానించాల్సి వస్తోంది. ఇది ఒక విష సంస్కృతి. ఇది మెల్లగా పాకి నేటి సమాజానికి ఓ చీడగా తయారవుతోంది. దీన్ని ఏదో రకంగా తుద ముట్టించకపోతే బంగారం లాంటి యువత బ్రతుకు బుగ్గిపాలు కాక తప్పదు.  ఇక తల్లిదండ్రులు కూడా బాధ్యతగా ఉంటూ, ఎక్కడికక్కడ అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలి.

మిగతా 27వ పేజీలో...

# మదీనాలో తొలి రెండేళ్ళు




- ఎస్.ఎమ్. మలిక్

ప్రవక్త మహనీయులు(స) మదీనాకు హిజ్రత్ చేసి వచ్చిన తరువాత ఇక్కడ సంభవిస్తున్న ఉద్యమ కార్యకలాపాలను గురించి మక్కా వాసులకు సమాచారం ఎప్పటికప్పుడు అందు తూనే ఉంది. అందువల్లనే మదీనా నాయకుల్లో ఒకరయిన మహనీయులు సఅద్ బిన్ ముఆజ్, మక్కాకు ఉమ్రా సంకల్పంతో వెళ్ళినప్పుడు అబూజహ్లొ బెదిరించాడు. అప్పుడే మహనీయ సఅద్ కూడా అతనికి తగిన సమాధానమిస్తూ- మీరు మమ్మల్ని దైవ గృహం కాబా దర్శనానికి రాకుండా చేసినట్లయితే మీకు అత్యంత ఆవశ్యకమయిన వ్యాపార ప్రయాణాల రహదారి మదీనా గుండా సాగకుండా చేయగలము- అని భయపెట్టారు.

### తెగలతో రాయబారాలు

ఇస్లామీయ ఉద్యమం మదీనాలో వ్రేళ్ళూనడమే కాక అనుదినం దాని కార్యకలాపాలు విస్తరిస్తూనే ఉండటం ఖురైషీలకు ఎంత మాత్రం చల్లని గుండెలతో భరింపరానిదయిపోయింది. మదీనా లోని ద్వంద్వ స్వభావులతో కుమ్మక్కయి ఎలాగయినా ప్రవక్తశ్రీ (స)నీ, ఆయన కార్యకలాపాలను తుదముట్టించాలని అనుదినం కుట్రలూ కుతంత్రాలూ పన్నుతూ ఉండేవారు. దానికి మదీనా పరిసరాల్లోని ఇతర తెగలవాళ్ళనూ పురికొలుపుతూ ఉండేవారు. వారిని ఈ దుష్ట సంకల్పం నుండి వారించడానికి ఏవయినా ఉపాయాలు అన్వేషించడం అనివార్యమయిపోయింది. లేకపోతే ఇప్పుడిప్పుడే మదీనాలో వ్రేళ్ళూనిన ఇస్లామీయ సముదాయానికి శ్వాస పీల్చే అవకాశం కూడా ప్రాప్తం కాదు. అందువల్ల మహనీయ సఅద్ బిన్ ముఆజ్ అబూ జహ్లుకు ఇచ్చిన గట్టి సమాధానాన్నను సరించి మక్కా నుండి సిరియా తదితర వాణిజ్య ప్రధానమయిన ప్రాంతాలకు వెళ్ళే రహదారి గుండా వారి రాకపోకలు సురక్షితంగా లేవని, మక్కా వాసులకు, వారి కుట్రల్లో భాగస్వాములవుతున్న ఇతర తెగలకూ బాగా అవగతమయ్యేలా చెయ్యాలని సంకల్పిం చుకున్నారు ప్రవక్త మహనీయులు(స).

ఆ ప్రయత్నాల్లో భాగంగా మదీనాకు, ఎర్ర సముద్రం తీరాన గల ఆ సిరియా రహదారికి సమీపాన ఉన్న తెగలవారితో సంప్రతింపులు ప్రారంభించారు. వారు మదీనా వాసులతో ఒడంబడిక చేసుకుని సహాయకులుగానయినా రూపొందాలి లేదా కనీసం విపత్కర పరిస్థితుల్లో అలీనంగానయినా ఉండగల గాలి అన్నదే ఉద్దేశ్యం. ఈ ప్రయత్నం చాలావరకు ఫలవంత మయింది. కొందరితో అలీన విధానం అవలంబించే ఒప్పందం జరిగితే మరికొందరితో రక్షణ ప్రధానమయిన ఒడంబడిక (Defensive alliance) కుదిరింది. అదేవిధంగా ఇస్లామ్ సందేశ కార్యం వల్ల ఆయా తెగల్లో ఇస్లామ్ అనుయాయులు, సమర్థకుల

ఓ పెద్ద సంఖ్య కూడా ప్రాప్తమయింది. రెండవ చర్యగా ప్రవక్త(శ్రీ(స) సిరియా రహదారిపైన గస్తీ బృందాలు పంపసాగారు. దానివల్ల ప్రవక్త శ్రీ(స) ప్రతీప శక్తుల పట్ల జాగరూకులయి ఉన్నారని, ప్రమత్తంగా లేరని అందరికీ బాగా అర్థమయి పోవాలన్నది ఉద్దేశం.

ఈ కార్యకలాపాలలో ఎటువంటి రక్తపాతం జరగకుండా, వ్యాపార బృందాలకు ఎటువంటి హాని కలగకుండా జాగ్రత్త వహించడం జరిగింది. ఘర్షణకు దిగే ఎటువంటి చర్య కూడా తీసుకోవడం జరగలేదు. కాని మక్కావాసులు మదీనా వాసుల కనుగప్పి మదీనా శివారు ప్రాంతంలో ఓ తెగపైకి దాడి జరిపి మదీనావాసుల కొన్ని పశువుల్ని కొల్లగొట్టుకుని తోలుకుపోయారు. ఇలా ఈ సంఘర్షణ మక్కా మదీనా వాసులవరకే కాక ఇతర తెగల్ని సయితం ఇందులో ఇరికించాలన్నది కురైషీల ఎత్తుగడ.

## గస్తీ దళాలు

ప్రవక్త(శ్రీ పంపిన గస్తీ దళాలు ఘర్షణకు లూటీకి దిగరాదన్నది ఆదేశం. అందువల్ల అవి కేవలం రహదారి వెంట జరిగే కార్యకలాపాల ఆచూకి సేకరించటం వరకే వాటికి పరిమితి. అలాంటి ఓ బృందం మహనీయ హమ్జా(ర) నాయకత్వంలో 30 మంది ముహాజిర్లతో పంపగా సిరియా నుంచి తిరుగుముఖం పట్టి వస్తున్న ఓ కురైషీ వ్యాపార బృందం దాన్ని ఎదుర్కొంది. మక్కా వ్యాపార బృందంలో 300 మంది ఉన్నారు. మహనీయ హమ్జా(ర) దాదాపు ఎర్ర సముద్రం తీరాన చేరుకున్నారు అప్పుడు. హమ్జా (ర) వారి బృందాన్ని చూడగానే మక్కావాసులు ఘర్షణకు దిగారు. ఘర్షణ పెరిగేదే కాని లోగడ ప్రవక్త(శ్రీ(స) రాయబారం వల్ల అలీనంగా ఉండేందుకు ఒప్పందం కుదుర్చుకున్న తీర ప్రాంతంలోని ఓ తెగ మధ్యవర్తిత్వంతో అది నిలిచిపోయింది. అయితే కురైషీలకు హెచ్చరిక జరగవలసిన తీరులో జరిగింది, తమ వర్తక బృందాలు సక్రమంగా రాకపోకలు సాగించకపోతే, ఇక అవి ముస్లిముల చర్యల నుండి సురక్షితంగా మనజాలవని వారికి అర్థమయి పోయింది. ఆ సందర్భంలో మహనీయ హమ్జాకు ప్రవక్త(శ్రీ, స్వయంగా తన చేత్తో కట్టి అప్పగించిన ధ్వజం తెల్ల రంగుది.

అలాగే మహనీయులు ఉబైదా బిన్ హారిస్, సఅద్ బిన్ అబీ వక్కాస్, స్వయంగా ప్రవక్త(శ్రీ(స) ఆధ్వర్యాన ఏడు గస్తీ దళాల పర్యటనలు జరిగాయి. ఈ పర్యటనల్లో కొన్నింటిలో ప్రవక్త మహనీయులు(స) తెగలతో మైత్రీ ఒప్పందాలు, మరి కొన్నింటిలో మక్కా దుండగుల్ని వెంటాడటం జరిగింది. వీటిలో కడపటి గజ్వా❖ హిజ్రత్ జరిగిన 16 నెలలకు సంభవించింది. అయితే ఒకటి జరిగింది, కురైషీలు ఈ గస్తీ దళాల చర్యలకు కోపోద్రిక్తుల య్యారు, వారు, "ఈ బెడద"ను శాశ్వతంగా అంతమొందించడానికి కార్యక్రమం చేపట్టాలని పూనుకున్నారు.

## కిబ్లా ◆ మార్పు

ప్రవక్త మహనీయులు హిజ్రత్ తరువాత దాదాపు 17 నెలల వరకు బైతుల్ మక్దిస్(జెరుసలేము) దిశ వైపునకు తిరిగి నమాజ్ చేసేవారు. ఆ తరువాత బహుశా రజబ్ నెల, హిజ్రీ రెండవ సంవత్సరం, (హిజ్రత్ తరువాత దాదాపు 20 నెలల తరువాత) కిబ్లా పరివర్తనకు దైవాదేశమయింది. జరిగిందేమిటంటే ప్రవక్త(శ్రీ(స) బిష్ర్ బిన్ బరా' ఇంట భోజనానికి వెళ్ళి ఉండగా అక్కడ జుహ్ర్ నమాజ్ వేళయింది. ప్రవక్త నమాజ్ చేయించడానికి నిలబడ్డారు. రెండు రక'తుల నమాజ్ ముగిసిన తరువాత మూడవ రక'త్‌లో కిబ్లా మార్పునకు అకస్మాత్తుగా వహీ అవతరించింది. వహీలో ఈ ఆయత్ అవతరణ జరిగింది:

> మస్జిదుల్ హరామ్(కాబా) వైపునకు (నమాజ్) దిశ మార్చి వెయ్యి, ఇక మీరు ఎక్కడున్నా ఆ వైపునకే అభిముఖంగా నమాజ్ ఆచరించండి. (అల్ బకర 2: 144)

అప్పటికప్పుడు ప్రవక్త, ఆయనతోపాటు నమాజ్‌లో అనుసరిస్తున్న వారు అంతా, బైతుల్ మక్దిస్ వైపు నుండి, కాబా, మక్కా వైపునకు నమాజ్ అభిముఖ దిశను మార్చుకున్నారు. ఆ తరువాత మదీనాలో ఆ మేరకు చాటింపు వెయ్యడం జరిగింది. తదనుగుణంగా ముస్లిములు తమ నమాజ్ అభిముఖ దిశను ప్రతి చోటా మార్చుకున్నారు. ఈ మార్పును సయితం యూదులు, క్రైస్తవులు, ద్వంద్వ స్వభావులు, చీటికిమాటికి ఆక్షేపణలు చేసేవారు, ఈ మార్పును చల్లని గుండెలతో భరించగలరా? వారు వెంటనే ఆక్షేపించారు, "తమరు అబ్రహామును అనుసరించేవారని చాటుకున్నారే, ఇప్పుడిదేమయింది? బైతుల్ మక్దిస్ నుండి కాబా వైపునకు తిరిగారు?" అని అర్థంలేని అభ్యంతరాలు లేవనెత్తారు. వారి ఆక్షేపణను కూడా దివ్యకుర్ఆన్ ఉటంకించి దానికి

❖ *గజ్వా= ఇస్లామీయ చరిత్రకారులు స్వయంగా ప్రవక్త మహనీయులు పాల్గొన్న ఇలాంటి చర్యల్ని "గజ్వా" అని, కేవలం సహచర మాన్యుల ఆధ్వర్యాన పంపిన చర్యలకు "సరియ్యా" అనీ పేర్కొన్నారు.*

◆ *కిబ్లా = నమాజ్‌లో అభిముఖ దిశ*

సమాధానం చెప్పడమూ జరిగింది. ఇంకా, వారి సంకుచిత బుద్ధిని ఖండిస్తూ, దైవం ఏదో ఒక దిశలో బందీ అయిలేడు అని స్పష్టం చేయడం జరిగింది-

ప్రాక్ పశ్చిమాలు అల్లాహ్‌కే చెందినవి. మీరు ఎటు మరలినా ఆ వైపుననే అల్లాహ్ దిశ. అల్లాహ్ ఎంతో విస్తృతి గలవాడు, సర్వం తెలిసినవాడు (అల్ బఖర 2: 115) ❖

అవివేకులు, 'కిబ్లా పరివర్తన' అంటే ఇది కేవలం ఒక దిశ నుండి మరో దిశ వైపునకు మరలడమేనని భావిస్తున్నారు; వాస్తవంగా ఇది మరో సంకేతం, లోగడ దైవం ఇస్రాయేలీయుల్ని ప్రపంచ మార్గదర్శకత్వానికి నాయకత్వపు బాధ్యత అప్పగించాడు, వారు తమ్ముతాము దీనికి అర్హులం కామని, తమ దుశ్చేష్టల వల్ల రుజువు చేసుకున్నారు; ఇక ప్రపంచంలో మానవాళికి దైవమార్గ బోధనా బాధ్యత నుండి వారిని తొలగించి వారి స్థానే మహనీయ ముహమ్మద్ అనుయాయి సముదాయమయిన ముస్లిమ్ సముదాయానికి ఆ బాధ్యతలు అప్పగించబడ్డాయని అర్థం. దీన్ని సరిగ్గా నిర్వర్తించి, ఈ బాధ్యతల్ని అప్పగించినందుకు దైవానికి కృతజ్ఞులయి, తమ స్థాయీ స్థానాన్ని గుర్తెరిగి సరిగ్గా ప్రవర్తించినప్పుడే ఈ స్థానం ముస్లిములకూ చిరస్థాయి కాగలదు, లేకపోతే ప్రపంచంలో ఏ వర్గం ఈ బాధ్యతల్ని తెలుసుకుని మసలుకుంటుందో వారికి, అరబ్బులను తొలగించి అప్పగించడం జరుగుతుందని దీని మూలంగా ప్రకటించడం కూడా జరిగిందన్నది వాస్తవం.

## రమజాన్ ఉపవాస వ్రతాలు

కిబ్లా పరివర్తనకు ఆదేశం వచ్చిన తరువాత దానికి అతి సమీప కాలాన రమజాన్ నెల పూర్తిగా ఉపవాసవ్రతం పాటించే విధి ఆదేశాలు వచ్చేశాయి. ఇలా విధి అయిన ఆరాధనలో అయిదు వేళల నమాజ్ తరువాత ఇది నిర్ణీత రూపంలో విధ్యుక్తమయిన ఆరాధన. బకర సూరాలో ఇలా నిర్దేశించడం జరిగింది :

విశ్వసించిన వారలారా, మీకు ఉపవాస వ్రతాలు విధిగా నిర్ణయించడం జరిగింది, మీకు పూర్వపు ప్రవక్తల అనుయాయుల మాదిరిగానే. దీనివల్ల మీలో నిష్ఠాగుణం పెంపొందగలదని ఆశించడం జరుగుతోంది.
(అల్ బకర 2: 183)

ఇది తొలి ఆదేశం, దీనికి ఒక సంవత్సరం తరువాత మరిన్ని ఆదేశాలు జారీ అయ్యాయి :

రమజాన్ నెల, ఇందులోనే కుర్‌ఆన్ అవతరించబడింది. ఇది మానవులకు ఆసాంతం మార్గబోధనం, ఇంకా ఇందులో సన్మార్గాన్ని చూపే, సత్యాసత్యాల వ్యత్యాసాన్ని విడమర్చి చెప్పే ప్రస్ఫుటమయిన బోధనలు నిండి ఉన్నాయి. కనుక ఇకపై ఈ నెలను కనగలిగినవారు ఈ నెల సాంతం విధిగా ఉపవాస వ్రతం పాటించాలి.
(అల్ బకర 2: 185)

రోజా నియమాలు, సమయం, తదితర వివరాలు కూడా అవతరింపజేయబడ్డాయి, ప్రవక్త మహనీయులు దాన్ని ఆచరణ రూపేణా పాటించి, పాటింపజేసి, విశ్వాసుల మార్గం సుగమం చేశారు.

## పోరుకు అనుమతి

హిజ్రత్ తరువాత తొలిసారిగా హజ్జ్ కాలం వచ్చినప్పుడు, మక్కా నుండి ముహాజిరులయి మదీనా వచ్చిన ముస్లిములకు సహజంగానే తమ నగరంలో కాబా గృహం, హజ్జ్ మహా సమ్మేళనం గుర్తుకు వచ్చి ఉంటుంది. అలాగే మదీనాలో ఇస్లామ్ స్వీకరించిన ముస్లిములకు కూడా కాబా గృహ దర్శనం చేసుకునే భాగ్యం తమకు దక్కలేదన్న బెంగ బాధపెడుతూ ఉంటుంది. ఈ విధంగా ముస్లిములకు తీరని మనస్తాపం కలిగింది. జిల్‌హజ్జా నెల వచ్చినప్పుడు ప్రవక్త(శ్రీ(స) వచ్చి దాదాపు పది నెలలు కడిచాయి. ఇల్లూ వాకిలి, కాబా దర్శన సౌభాగ్యం వదలివచ్చినా తమను ప్రశాంతంగా జీవించడానికి మక్కా ఖురైషీలు వదలి పెట్టలేదు, ఆ సందర్భంలో దైవ వచనాలు అవతరించాయి:

ఎవరికి ప్రతిగా పోరు చెయ్యడం జరుగుతుందో వారికి కత్తి చేపట్టే అనుమతి ఇవ్వబడుతోంది, ఎందుకంటే వారు పీడితులు, నిశ్చయంగా అల్లాహ్ వారికి సహాయమొనర్చడానికి సమర్థుడే. వీరు తమ నివాస స్థలాల నుండి అక్రమంగా తరిమి వెయ్యబడినవారు; వారి నేరం, కేవలం, 'మా ప్రభువు అల్లాహ్' అని ప్రకటించడమే.
(అల్ హజ్జ్ 22: 39, 40)

❖ *కాబా వైపునకు తిరిగి నమాజ్ చెయ్యడమంటే కాబా వైపునకు ముక్కుకు సూటిగా తిరిగి నమాజ్ చెయ్యాలని అర్థం కాదు. మనిషి ప్రపంచంలో ఎక్కడున్నా అక్కడికి కాబా ఏ దిశన ఉందో ఓ అంచనా కట్టి ఆ వైపునకు మరలడంతో సరిపోతుంది. భారత దేశ వాసులకు 'కాబా' (మక్కా) పశ్చిమాన ఉంది. కాబట్టి పశ్చిమ దిశకు అభిముఖంగా నమాజ్ చెయ్యడం సరయినదే.*

దైవమే తమ ఏకైక ప్రభువని ప్రకటించినందుకు కురైషీ పెద్దలు తోటి సోదరుల్ని నానా హింసలకు గురిచెయ్యడం తమకు న్యాయ సమ్మతం చేసుకున్నారు. ఆ బాధలకు తట్టుకోలేక తమ స్వగృహా లను సయితం వదులుకుని పరదేశానికి వలసవెళ్ళినా అక్కడా స్థిమితంగా కూర్చోనివ్వడంలేదు. అప్పుడే కత్తి చేపట్టే అనుమతి ఇవ్వబడింది, ఆ తరువాతనే ప్రవక్త మహనీయులు, గస్తీ దళాలు పంపడం మొదలెట్టారు, అందులో ఒక దళానికి స్వయంగా ప్రవక్త మహనీయులే నాయకత్వం వహించారు. ఈ అనుమతి లభించి నప్పుడు ముస్లిముల మొత్తం బలం కేవలం మదీనా గ్రామం వరకే పరిమితం. ముహాజిరులు, అన్సారులు కలిపి వెయ్యిమంది కన్నా అధికంగా లేరు. దీనికి భిన్నంగా కురైష్ జనులు, ఒక తెగ మాత్రమేకాక ఇతర బహుదైవారాధకుల తెగలు సయితం వారికి కుమ్మక్కయి ఉన్నారు. పైగా యూదులు సయితం వారికి తోడుగా ఉన్నారు. అటువంటి పరిస్థితుల్లో దైవం తరపున, తాను సహాయ పడటానికి సమర్థుడే అన్న వచనం ముస్లిములకు ఎంతో ధైర్యం కలగజేసింది, వారిలో ఇక అరేబియా మొత్తాన్ని ఎదిరించ గల సాహసం ఉరకలు వేయసాగింది.

## పోరుకు ఆదేశం

హిజ్రత్ తరువాత తొలి సంవత్సరం, జిల్‌హజ్జా నెలలో పోరుకు అనుమతి లభించిన పిమ్మట దాదాపు 8 నెలల తరువాత హిజ్రీ రెండవ సంవత్సరం పోరుకు ఆదేశం ఇవ్వబడింది :

> ఇక మీరు దైవమార్గంలో పోరాడండి మీతో పోరాడేవారితో, అయితే మితిమీరకండి, అల్లాహ్ మితిమీరే వారిని ఇష్టపడడు. (అల్ బకర 2: 190)

అంటే దైవకార్యంలో మీ దారికి అడ్డువచ్చేవారితో, మీరు దైవాదేశా లకనుగుణంగా జీవన వ్యవస్థను సంస్కరించదలిస్తే దాన్ని ప్రతిఘటిస్తున్నవారితో, మీపైన అక్రమాన్ని దౌర్జన్యాన్ని ప్రయోగి స్తున్నవారితో పోరాడండి అని ఆదేశించిన వెంటనే హద్దులు మీరకండి అని ఇస్లామీయ యుద్ధ నియమాన్ని చాటడం జరిగింది. ఈ యుద్ధ నియమం ప్రకారం, ముస్లిముల సైన్యం యుద్ధం చేసినా తమ భౌతిక ప్రయోజనాల కొరకు కారాదు. ఇంకా, సత్య ధర్మకార్యాల్లో మిమ్మల్ని ప్రతిఘటించని వారిపై చెయ్యి చేసుకో రాదు, అజ్ఞాన కాలపు విధానాలూ అనుసరించి మహిళలు, బాలలు, ముసలివారు, క్షతగాత్రులు తదితరులపైన కత్తి దూయటం, శత్రువుల చిత్రవధ చెయ్యడం, అలాగే పొలాలు, పశువుల్ని నాశనపరచడం చెయ్యరాదు. ప్రవక్త(శ్రీ(స) ప్రవచనాల్లో ఈ వివరాలన్నీ ఉన్నాయి. అంటే అనివార్యమయిన చోటనే, అవశ్యమయిన మేరకే శక్తినుపయోగించాలి అని అర్థం. ఆ తరువాత ఇంకా ఆదేశమయింది :

> వారితో పోరాడండి, వారిని ఎక్కడ మార్కొనడం జరిగినా, మరి వారు మిమ్మల్ని ఎక్కడి నుండి తరిమి వేశారో, అక్కడి నుండి వారినీ తరిమి కొట్టండి. ఎందుకంటే హత్య ఎట్టి పరిస్థితిలోనూ చెడ్డదే కాని పీడన అంతకన్నా ఘోరమ యినది. (అల్ బకర 2: 191)

ఇక్కడ పీడన అన్న పదం ఇంగ్లీషు పదం PERSECUTION అనే అర్థంలో ప్రయోగించడం జరిగింది. అంటే ఒక వర్గాన్ని, కేవలం చెలామణిలో ఉన్న అభిప్రాయాలు, సిద్ధాంతాలు, నమ్మకాలకు భిన్నమయిన భావాలను, సిద్ధాంతాలను సత్యమయినవిగా గ్రహించి స్వీకరించినందుకు దౌర్జన్యానికి, హింసకు గురి చెయ్యడం అన్నమాట.

తొలుత పోరుకు అనుమతి, తరువాత పోరుకు ఆదేశం, ఇక ముస్లిములు సాయుధ ఘర్షణను ఎదుర్కొంటే దాన్ని సాహసో పేతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధులవ్వాలని, భయాన్ని అధైర్యాన్ని దరిచేరనివ్వరాదు అన్న దానికి సంకేతం.


***ఆధారం :*** *1) సీరతున్నబీ కామిల్ : సం.1; పు.620-626*

*2) సీరతె సర్వరె ఆలమ్ : సం.3; పు.105-120*

*3) సీరత్ ఇన్‌సైక్లోపీడియా : సం.5; పు.226-235*



దళితుల, మహిళల ఆశల నిధి అంబుల పొది

గీటురాయి వారపత్రిక



# అబద్ధం మహాపాపం

- ముహమ్మద్ వహీదుద్దీన్

**ప్రాచీన** కాలం నాటి సంగతి. ఒక పట్టణానికి దగ్గర చిన్న గ్రామం ఉండేది. దానిపక్కనే పెద్ద అడవి ఉండేది. అందులో నుంచి విపరీతమైన శబ్దాలు వచ్చేవి.

గ్రామ ప్రజలు ఆ శబ్దాలు విని ఎక్కడి నుండి వస్తున్నాయో తెలియక భయపడేవారు. రాత్రి అయిందంటే ఆ శబ్దాలు ఇంకా ఎక్కువ అయ్యేవి.

ప్రజలు నిద్ర వదలి గుంపులు గుంపులుగా కర్రలు పట్టుకుని గ్రామ చౌరస్తాల వద్ద కూర్చొని ఉండసాగారు. చిన్న పిల్లలు, ఆడవాళ్ళు తమ తమ ఇండ్లలో తలుపులు పెట్టుకుని రాత్రుళ్ళు ఇలాగే గడిపేవారు. ఆ శబ్దం ఎక్కడ నుండి వస్తుందో తెలియదు. గ్రామానికి ఏదో చెడు జరగబోతుంది అని ఒకరినొకరు చెప్పుకోసాగారు.

ఈ క్రమంలో ఒక బాటసారి ఆ గ్రామానికి వచ్చాడు. 'మీరందరూ ఎందుకు భయపడుతున్నారో నాకు తెలిసిపోయింది. అడవిలో భయంకరమైన రాక్షసుడు నివసిస్తున్నాడు. అతడు ఒక గృహలోపల కూర్చుని భయంకరమైన అరుపులు, శబ్దాలు చేస్తున్నాడు' అని అన్నాడు.

అతను చెప్పిన అబద్ధపు మాటలు నమ్మి గ్రామ ప్రజలు ఇంకా భయపడసాగారు. ఒకరోజు అందరూ కలిసి రాజు దగ్గరకు వెళ్ళి గ్రామం ప్రక్కనే అడవి ఉంది. ఆ అడవి నుండి రాత్రికాగానే భయంకరమైన శబ్దాలు వస్తున్నాయి. అడవిలో ఉన్న రాక్షసులు ఈ శబ్దాలు చేస్తున్నాడని మాకు తెలిసింది. ఎలాగైనా ఆ రాక్షసుడి నుండి రక్షణ కల్పించమని వేడుకున్నారు.

'మీరు అడవిలోనికి వెళ్ళలేదు, రాక్షసుడిని చూడలేదు, ఈ అరుపులు (శబ్దాలు) రాక్షసుడివని మీరు ఎలా భావిస్తారు? అని రాజు ఎదురు ప్రశ్నించారు. అందులో నుంచి ఒక యువకుడు సమాధానం ఇస్తూ 'ఒక బాటసారి మా గ్రామానికి వచ్చి ఈ విషయం చెప్పాడ'ని సమాధానం ఇచ్చాడు.

దాంతో రాజు రాక్షసుడి నుండి విముక్తి కలిగించే వారికి గొప్ప బహుమానం ఇవ్వబడుతుందని రాజు దర్బారులో ప్రకటించాడు. ఈ విషయం పట్టణంలో ఉండే ఒక బాలుడి చెవిలో పడింది.

ఎలాగైనా రాక్షసుడి నుంచి గ్రామ ప్రజలను రక్షించాలని నిర్ణ యించుకున్నాడు. అతడు చాలా తెలివైన బాలుడు. రాజు దగ్గరికి నేరుగా వెళ్ళాడు. మహారాజా! నేను ఎలాగైనా భయంకరమైన రాక్షసుడిని ధైర్యంగా ఎదుర్కొంటాను అని అన్నాడు. రాజు ఆశ్చర్యానికి లోనయ్యాడు.

చివరకు రాజు అతనికి అడవిలో వెళ్లడానికి అనుమతి ఇచ్చాడు. గ్రామ ప్రజలందరూ ఆశ్చర్యపడ్డారు. ఇంత చిన్న బాలుడు అంత పెద్ద రాక్షసుడితో ఎలా ఎదుర్కొంటాడా అని.

ధైర్యంతో ఆ బాలుడు అడవిలోకి వెళ్ళి తిరగడం ప్రారంభించాడు. తిరిగి తిరిగి అలసిపోయి ఒక చెట్టు కింద కూర్చున్నాడు. చీకటి పడుతుంది. ఏం చేయాలో అర్థంకాక ఆలోచిస్తూ ఉండిపోయాడు.

అంతలోనే దూరం నుండి అరుపులు రావడం విన్నాడు. వెంటనే లేచి పెద్ద కర్ర తీసుకుని శబ్దాలు వచ్చే వైపు నడవడం ప్రారంభించాడు. ఆ ప్రాంతానికి చేరుకున్నాడు.

ఒక పెద్ద ఏనుగు గుంతలో పడి ఉంది. కాళ్ళలో పెద్ద పెద్ద ముళ్ళు గుచ్చుకుని ఉన్నాయి. దెబ్బలు తగిలి ఉన్నాయి. ఒక కాలు విరిగి ఉంది. తొండానికి బలమైన గాయం ఉంది.

కాలు విరిగి, గాయాల నొప్పులు భరించలేక అరుపులు పెడుతుంది. చీకటి పడగానే భయంతో ఇంకా ఎక్కువగా శబ్దాలు చేసేది.

ఏనుగు బాధను చూసి వెంటనే బాలుడు గ్రామ ప్రజల దగ్గరికి వెళ్ళాడు. నాతోపాటు ఇప్పుడే మీరు అడవిలోకి రావాలని అన్నాడు. రాత్రి అయింది. ఆ రాక్షసుడు మనందరిని చంపేస్తాడు. మేము రాము అని అందరూ ముక్కుసూటిగా చెప్పేశారు. మరోసారి అందరినీ బ్రతిమాలాడు. కానీ ఎవరూ సహాయం చేయడానికి ముందుకు రాలేదు.

ఆ బాలుడు నేరుగా రాజు దగ్గరికి వెళ్ళి ఉన్న విషయం చెప్పేశాడు. రాజుగారు! నాకు సహాయం కోసం బలమైన 50 మంది సైనికులతోపాటు ఒక వైద్యుడ్ని కూడా పంపమని విజ్ఞప్తి చేశాడు. రాజుగారు అందరినీ ఆ బాలుడు వెంట అడవిలోకి పంపించాడు.

అందరూ కలిసి ఆ ఏనుగును గుంత నుండి బయటకు తీశారు. కాళ్ళలో ఉన్న ముళ్ళను తొలగించి, విరిగిన కాలును సరిచేసి, గాయాలైన చోట మందు పూసి, నీళ్ళతో ఏనుగును శుభ్రంగా కడిగి, ఆహారాన్ని తినిపించి, నీళ్ళు త్రాపించి అందరూ వెళ్ళిపోయారు.

మరుసటి రోజే రాజు గారు గ్రామ ప్రజలను తన దర్బారుకు పిలిపించి, మీరు చేయలేని సాహసం చిన్న బాలుడు చేసి చూపించాడు. రాక్షసుడు లేడు, అతని అరుపులు లేవు. ఏనుగు గుంతలో పడి బాధతో పెట్టిన అరుపులు మాత్రమే అంటూ మొత్తం విషయం చెప్పేశాడు. అందరూ సిగ్గుతో తలవంచుకున్నారు, రాజుగారు బాలునికి మంచి కానుకలు ఇచ్చి పంపారు.

ఎవరైనా ఏదైనా సమాచారం ఇచ్చినప్పుడు అది తప్పో, ఒప్పో తెలుసుకుని ఇతరులకు ఆ సమాచారం అందించాలి. లేకపోతే అనర్థాలు, అపోహలు, భయం లేనిపోని సమస్యలు ఏర్పడతాయి.

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు :

ఎవరైనా మీకు సమాచారం ఇస్తే తప్పో, ఒప్పో (మంచి, చెడు) తెలుసుకోవాలని, మంచిదైతే ఇతరులకు చేరవేయాలని, చెడు అయితే ఆపే ప్రయత్నం గట్టిగా చేయాలన్నారు.

అబద్ధం మహాపాపం. ఎట్టి పరిస్థితుల్లో కూడా అబద్ధం ఆడరాదు, ప్రాణం పోయినా సరే స్థిరంగా ఉండాలని చెప్పారు.

ఆపదలు (కష్టాలు) వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని, కష్టాలను చూసి పారిపోయి ఇంట్లో కూర్చుంటే, పరిష్కార మార్గం దొరకదని దైవప్రవక్త(స) ఒక సందర్భంలో తెలియజేశారు.

**21వ పేజీ తరువాయి...**

తమ బిడ్డలు పెరిగి పెద్దయి మంచి చదువులు చదివి బాగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు అని తల్లిదండ్రులు భావిస్తున్నారు. అయిదంకెల జీతాన్ని తొలి ప్రయత్నంలోనే సాధిస్తున్న యువత తమకు ఎదురులేదని భావిస్తోంది. ఇప్పుడంతా స్వార్థం, దానితోపాటు లెక్కలేనితనం. తన జీవితం మీద కూడా వారికి అదుపు, అజమాయిషీ లేకుండా పోతోంది. ఇక ఈ దూకుడులో యువతరం చాలా తప్పులు చేస్తున్నారు. అలాంటి వారిని కొందరు తల్లిదండ్రులు కడుపు తీపితో వెనుకేసుకుని వస్తున్నారు. దీని వలన నిజంగా వారు బాగుపడాలనే కోరుకుంటున్నారా అన్న సందేహం కలుగుతోంది. "తప్పు ఎవరిదైనా తప్పే" అని చెప్పేవారే గొప్ప తల్లిదండ్రులు. ఇక్కడ మరో విషయం కూడా ఆలోచించాలి. పిల్లలు తమ వారు, తమ హక్కు అని మాత్రమే తల్లిదండ్రులు అనుకుంటున్నారు. అలాగే భావిస్తున్నారు కూడా. కానీ పుట్టిన ప్రతి వారు సమాజానికి చెందుతారు. వారే రేపటి తరానికి బాధ్యులుగా ఉండాల్సి ఉంటుంది. ఈనాటి పిల్లలు రేపటి సమాజాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తారో అన్న బెంగ బెదురు అయితే అంతటా కనిపిస్తోంది. కాబట్టి ఏది ఏమైనా తల్లిదండ్రుల మీద ఎంతటి గురుతరమైన కర్తవ్యం ఉందో చూడండి.

## ముగింపు

- కుటుంబ సభ్యుల మధ్య మంచి వాతావరణం ఉండేటట్లు చూడాలి.
- 'డబ్బులు ఇస్తే సరిపోతుంది' అనే ఆలోచనలు పక్కనపెట్టాలి.
- పిల్లల సాధక బాధకాలు తెలుసుకుని సమస్యలు విని స్నేహితుల వలే తల్లిదండ్రులు మెలగాలి. రోజూ కొంత సమయం పిల్లలకు కేటాయించాలి.
- మత్తు మందులకు చిత్తు కాకుండా మంచి పౌరులుగా తమ పిల్లలను తీర్చిదిద్దుటలో తల్లిదండ్రులు ప్రధాన బాధ్యత తీసుకోవాలి.

# జాతిని కదిలించిన స్వాతంత్ర్యోద్యమ నినాదాలు




**మదీహా అర్జుమంద్**

**భారతదేశ** స్వాతంత్ర్య సంగ్రామంలో ఎంతో మంది త్యాగధనులు తమ రక్తాన్ని, ప్రాణాన్ని ధారపోసి స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టారు. దేశం స్వాతంత్ర్యం సాధించి ఏడున్నర దశాబ్దాలు అయిన సందర్భాన్ని పురస్కరించుకొని భారత స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకుంటున్నవేళ ఉద్యమానికి స్ఫూర్తిని, ప్రేరణను అందించిన, శక్తివంతమైన కొన్ని నినాదాలను మననం చేసుకోవడం మన నైతిక కర్తవ్యం. సాధారణంగా రాజులు యుద్ధాలకు వెళ్ళేట ప్పుడు శత్రు సైన్యాన్ని భయపెట్టే ఉద్దేశంతో రకరకాల ధ్వనులు, భీకరమైన శబ్దాలు, రణన్నినాదాలు చేస్తారు. అరుపులు, కేకలు, నినాదాలతో యుద్ధమైదానం మార్మోగిపోతుంది. ఢమరుక నాదం, శంఖానాదాలతో తమ సైనికుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు, శత్రు సైన్యంలో భయోత్పాతాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తారు. అటువంటి సాధనాలలో నినాదం ఓ ప్రముఖ ఆయుధం. 'క్విట్ ఇండియా' (1942) నినాదం మనందరికీ సుపరిచితం. ఇది భారతీయుల హదయాల్లో ఎంతగా నాటుకుపోయిందో బ్రిటిష్ పాలకుల గుండెల్లో కూడా అంతగా గుచ్చుకుపోయి వారిని భయకంపితుల్ని చేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే దేశ స్వాతంత్ర్యోద్యమాన్నే ఈ నినాదం ఓ మలుపు తిప్పింది. 'క్విట్ ఇండియా' ఇంతటి శక్తివంతమైన నినాద రూపకర్త యూసుఫ్ మెహర్ అలీ. ఉద్యమ సమయంలో ఆయన ముంబై మేయర్‌గా ఉన్నారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఆయన ఎనిమిది సార్లు జైలుకెళ్లారు. స్వాతంత్ర్యోద్యమానికి ఊపునిచ్చిన 'క్విట్ ఇండియా' అనే పదం నేపథ్యాన్ని చూసినట్లయితే.. దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు వ్యూహ రచన చేస్తున్న మహాత్మాగాంధీ తన సహచరులతో ముంబైలో సమావేశమైనప్పుడు స్వాతంత్ర్య పోరాటానికి పనికొచ్చే మంచి నినాదాలను సూచించాలని కోరారు. అప్పుడు ఒకరు 'గెటవుట్' అని అన్నారు. అది బాగా లేదని గాంధీజీ తిరస్కరించారు. 'రిట్రీట్ ఆర్ విత్‌డ్రా' అన్న పదాన్ని రాజగోపాలచారి సూచించగా, అక్కడే ఉన్న యూసుఫ్ మెహర్ అలీ 'క్విట్ ఇండియా' అనే పదాన్ని ప్రతిపాదించారు. గాంధీజీకి ఈ నినాదం అమితంగా నచ్చి, వెంటనే ఆ పదాన్ని ఆమోదించారు. అలాగే 'సైమన్ గో బ్యాక్' అనే విప్లవాత్మక నినాదం కూడా యూసుఫ్ మెహర్ అలీదే. ఈ నినాదం కూడా విపరీతంగా ప్రజల్లోకి చొచ్చుకు పోయింది. 1928 లో నాటి బ్రిటీష్ ఇండియా ప్రభుత్వ పాలన మెరగుపర్చేందుకు సూచనలు, సలహాలు ఇవ్వడం కోసం బ్రిటిష్ పాలకులు సైమన్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. అందులో ఒక్క భారతీయుడికీ స్థానం కల్పించ లేదు. అందరూ బ్రిటిష్ అధికారులే ఉన్నారు. దీనికి నిరసనగా, 1928లో సైమన్ కమిషన్ ముంబై రేవులో దిగినప్పుడు యూసుఫ్ మెహర్ అలీ కొంత మందితో కలిసి కూలీల వేషంలో రేవుకువెళ్ళి 'సైమన్ గో బ్యాక్' అని గర్జిస్తూ నిరసన ప్రదర్శన చేశారు.

మరో స్ఫూర్తిదాయకమైన, చైతన్యశీల నినాదం 'ఇంక్విలాబ్ జిందాబాద్'. ఈ నినాదాన్ని ప్రముఖ ఉర్దూ కవి, ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా హస్రత్ మోహనీ రూపొందించారు. ఈ నినాదం భగత్ సింగ్‌కు అమితంగా నచ్చింది. అత్యంత ప్రభావవంతమైన ఇంక్విలాబ్ జిందాబాద్ అనే ఈ

నినాదాన్ని షహీద్ భగత్ సింగ్ విపరీతంగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటే.. విప్లవం వర్ధిల్లాలి. అని అర్థం. ఈ నినాదం స్వాతంత్ర్య పోరాట రణ నినాదాలలో ఒకటిగా మారిపోయింది. భారతీయ యువతను స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనే విధంగా ప్రేరేపించింది. ఇది వారిలో దేశభక్తి భావనను, స్వాతంత్రేచ్ఛను జాగృతం చేసింది.

సత్యమేవ జయతే - ఈ నినాదాన్ని పండిట్ మదన్ మోహన్ మాలవీయ రూపొందించారు. ఎప్పటికైనా సత్యమే జయిస్తుంది అనేది దీని అర్థం. దీన్ని మనం జాతీయ నినాదంగా స్వీకరించడమే కాకుండా మన జాతీయ చిహ్నం మీద కూడా ఇది రాయబడి ఉంటుంది.1918 లో భారత జాతీయ కాంగ్రెస్ సదస్సుకు అధ్యక్షత వహిస్తూ పండిట్ మదన్ మోహన్ మాలవీయ ఈ నినాదాన్ని ఉద్ఘోషించారు.

అలాగే, ఆసేతు హిమాచలం ఆబాల గోపాలాన్ని ఉర్రూతలూ గించిన నినాదం 'జైహింద్'. దీన్ని హైదరాబాదుకు చెందిన ఆబిద్ హసన్ సఫ్రానీ రూపొందించారు. అతి కొద్దికాలంలోనే నేతాజీ ద్వారా ఈ నినాదం స్వాతంత్ర్య సమరయోధుల అధికారిక నినాదంగా మారిపోయింది. ఇప్పటికీ రాజకీయ నాయకులు, దేశభక్తులు తరచూ ఈ నినాదాన్ని ఉపయోగిస్తూ ఉంటారు. అనుపమానమైన దేశభక్తికి తార్కాణంగా చేసే నినాదంగా నేటికీ ప్రజల హృదయాల్లో బలంగా ముద్రించుకు పోయింది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సుభాష్ చంద్రబోస్ భారత స్వాతంత్ర్య సమరానికి మద్దతు కూడగట్టేందుకు జర్మనీ వెళ్లారు. ఆ సమయంలో జర్మనీ బ్రిటన్‌తో యుద్ధం చేస్తోంది.

అదే సమయంలో ఆబిద్ కూడా తన ఇంజనీరింగ్ చదువు నిమిత్తం జర్మనీ వెళ్ళారు.

బోస్ ప్రసంగాలకు ప్రభావితమైన ఆబిద్ హసన్ తన ఇంజనీరింగ్ చదువును మధ్యలోనే విడిచిపెట్టి, ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా, జర్మన్ భాష అనువాదకుడిగా చేరిపొయ్యారు.

బోస్ పునర్వ్యవస్థీకరించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో ఆబిద్ మేజర్‌గా కూడా పని చేశారు.

ఇండియన్ నేషనల్ ఆర్మీలో భిన్న వర్గాలకు చెందిన ప్రజలు ఉండే వారు. అందులో కొంత మంది 'నమస్కార్' అని సంబోధిస్తే, మరికొంత మంది 'రామ్ రామ్' అంటూ పలకరించుకునేవారు. 'సత్ శ్రీ అకాల్', 'అస్సలాము అలైకుం' అంటూ అభివాదం చేసు కునేవారు కూడా ఉండేవారు.

సెక్యులర్ భావాలు కలిగిన బోస్‌కు ఇన్ని రకాల అభివాదాలు ఉండటం సబబుగా అనిపించలేదు. అందరికీ ఆమోద యోగ్యమైన ఓ అభివాద నినాదాన్ని రూపొందించాలని బోస్ తన సన్నిహితులకు చెప్పారు. ఆబిద్ ముందుగా 'హలో' అని ప్రతిపాదించారు కాని బోస్‌కు అది నచ్చలేదు. తర్వాత 'జై హిందుస్తాన్', 'జై హింద్' అనే నినాదాలను సూచించారు. జై హిందుస్తాన్ కాస్త పెద్దగా ఉండడంతో బోస్ 'జై హింద్'కే జై కొట్టారు. ఈ నినాదం బోస్‌కు ఎంతగానో నచ్చింది. వెంటనే ఆయన దాన్ని ఆమోదించి, విశేషంగా ప్రాచుర్యంలోకి తీసుకు వచ్చారు. అప్పటి నుంచి 'జై హింద్' అనే పదం దేశభక్తిని చాటుకునే ఒక నినాదంగా మారిపోయింది. అదేవిధంగా.. 'మీరు నాకు రక్తాన్నివ్వండి నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను' అని నినదించారు నేతాజీ. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో భారత జాతీయ సైన్యంలో చేరాలని భారత యువతను కోరుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ నినాదాన్ని ప్రయోగించారు. మాతృభూమి కోసం తమ జీవితాలను త్యాగం చేయడానికి వేలాది యువ హృదయాలను ఈ నినాదం ప్రేరేపించింది. వేలాదిమంది యువతీ యువకులకు ఈ నినాదం ఒక రణ నినాదమై అయస్కాంతంలా యువతను ఆకర్షించి స్వాతంత్రోద్యమం వైపు పరుగులు తీయించింది

అలాగే.. స్వరాజ్యం నా జన్మహక్కు అనే నినాదం. కాకా బాప్టిస్టా పలికిన ఈ నినాదాన్ని బాల గంగాధర్ తిలక్ స్వీకరించారు. స్వాతంత్ర్య పోరాటంలో దేశప్రేమికుల గుండెల్లో స్వతంత్ర జ్వాలలు రేకెత్తించారు. ఈ నినాదం దేశ ప్రజలను స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కోసం పోరాడటానికి ప్రేరేపించడమే కాక, వేలాది మంది ప్రజల హృదయాల్లో దేశంపై ప్రేమను ఉరకలెత్తించింది.

ముందే చెప్పుకున్నట్లు, సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ఆంగ్లేయులకు అంతిమంగా ఇచ్చిన ఒక వార్నింగ్ 'క్విట్ ఇండియా'. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ చేసిన బలమైన, అత్యంత గంభీరమైన ఒక విజ్ఞప్తి. బ్రిటిష్ వారిని ఒక్కసారిగా, స్పష్టంగా భారతదేశాన్ని విడిచిపెట్టమని చేసిన హెచ్చరిక. ఈ క్విట్ ఇండియా ఉద్యమం నుండి వచ్చిందే 'డూ ఆర్ డై' నినాదం. జాతీయ సమైక్యత, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో స్వాతంత్ర్య పోరాటం సాగుతుండగా గాంధీజీ ఇచ్చిన పిలుపు డూ ఆర్ డై ఉద్యమ కారుల్లో స్ఫూర్తిని నింపింది.

ఇవేకాకుండా ఇంకా ఇలాంటి అనేక నినాదాలు భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రధాన పాత్ర పోషించాయి. మన స్వాతంత్ర్య సమరయోధులు చేసిన నినాదాలు శత్రు హృదయాల్లో భీతిని కలిగించి మాతృభూమిని పరాయి బానిసత్వం నుండి విముక్తి చేశాయి.

# దైవప్రవక్తల అతిథి మర్యాదలు

- నసీరా బేగం

**కారుణ్యమూర్తి** మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు: ఏ వ్యక్తి అయితే అల్లాహ్‌ను, పరలోకాన్ని విశ్వసిస్తాడో అతను తప్పకుండా అతిథులకు ఆతిథ్యమివ్వాలి. (బుఖారీ)

అతిథులను గౌరవించటం, వారికి ఆతిథ్యమివ్వటం అనేది దైవ ప్రవక్తల సంప్రదాయం. దాని ఉపమానం దివ్య ఖుర్‌ఆన్‌లోని దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్(అ) గారి ద్వారా మనకు తెలుస్తోంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : ఓ ప్రవక్తా! ఇబ్రాహీమ్ గౌరవనీయులైన అతిథుల గాథ నీకు చేరిందా? వారు అతని వద్దకు వచ్చి "మీకు సలామ్" అని అన్నారు. అతను మీకు కూడా సలామ్-ఎవరో కొత్తవారులాగా ఉన్నారే" అని అన్నాడు. తరువాత అతను మౌనంగా తన ఇంటివారి వద్దకు వెళ్ళి ఒక (వేపబడిన) బలసిన మంచి ఆవు దూడను తెచ్చి అతిథుల ముందు పెట్టాడు. అతను "మీరు తినరా?" అని అడిగాడు. ఆ తరువాత అతను తన మనస్సులో వారంటే భయపడ్డాడు. వారు భయపడకండి అని అన్నారు. వారు అతనికి ఒక జ్ఞాన సంపన్నుడైన కుమారుడు జన్మిస్తాడని శుభవార్త వినిపించారు. (51: 24-30)

ఈ వాక్యం ద్వారా దైవప్రవక్త ఇబ్రాహీమ్(అ) అతిథులను చూసి ఎంతగా సంతోషపడేవారో, వారికి ఆతిథ్యమివ్వటంలో ఎంతగా త్వరపడేవారో, ఏ విధమైన మంచి భోజనాన్ని వారి కోసం ఏర్పాటు చేసేవారో స్పష్టంగా తెలుస్తోంది. అల్లాహ్ తరపు నుంచి శుభవార్తను తీసుకుని దైవదూతలు మానవాకారంలో ఇబ్రాహీమ్(అ) గారి వద్దకు వచ్చినప్పుడు ఆయన గారు ఎవరో కొత్త వ్యక్తులు తన వద్దకు వచ్చారని భావించి ముందుగా వారికి భోజన ఏర్పాట్లు చేశారు. ఇది ఆయనకు అలవాటుగా ఉన్న కారణంగా ఆయన ఈ విధమైన నాణ్యమైన మంచి భోజనాన్ని ఏర్పాటు చేశారు. దీని ద్వారా మనకు చాలా విషయాలు అర్థమవుతాయి. అందులో ఒకటి తనకున్న దాంట్లోనే అతిథులకు మంచి భోజనాన్ని ఏర్పాటు చేయాలనే విషయం కూడా.

దైవప్రవక్త(స) గారు కూడా ఆతిథ్యమివ్వటంలో అందరికంటే ముందుండేవారు. ఆయన(స) గారి జీవిత చరిత్ర అధ్యయనం చేసినట్లయితే ఎన్నో సంఘటనలు మనకు లభిస్తాయి. ఆయన(స) గారి ఇంటికి వచ్చిన ప్రతి అతిథికి తన దగ్గర ఉన్నదాంట్లో ఉత్తమమైన భోజనాన్ని వారికి పేట్టేవారు. ఒకవేళ ఆయన(స) గారు భోజనం చేస్తూ ఉన్నప్పుడు ఎవరైనా వచ్చినట్లయితే తనతోపాటు కూర్చొబెట్టుకుని మరీ తినిపించేవారు. ఎక్కడైనా, ఎప్పుడైనా అందరూ కలసి భోజన ఏర్పాట్లు చేస్తూ ఉన్నప్పుడు, తన అనుచరులందరికీ ఒక్కొక్క బాధ్యత అప్పగించినప్పుడు ఆయన(స) గారు కూడా ఏదో ఒక బాధ్యతను స్వయంగా తీసుకునే వారు. ఒకవేళ ఎప్పుడైనా ఎక్కువ సంఖ్యలో అతిథులు వచ్చేసినట్లయితే తన అనుచరుల ఇంటికి కొంత మందిని పంపి తాము కూడా స్వయంగా కొంత మందిని తమ ఇంటికి తీసుకునిపోయేవారు.

సందేశ ప్రచార ప్రారంభ కాలంలో మదీనా పట్టణంలో ఉన్నప్పుడు ఆయన(స) గారిపై ఆయన(స) గారి అనుచరులపై పస్తుల కాలం గడిచేది. కాని అలాంటి సమయంలో ఎప్పుడైనా ఏదైనా తినటానికి లభించినప్పుడు అది కొంతైనా సరే అల్లాహ్ అందులో శుభాలు అవతరింపజేస్తాడనే నమ్మకంతో తన అనుచరులను పిలిపించు కునేవారు. అంతేకాదు, ఇంకా ఎవరెవరు పస్తులుగా ఉన్నారో వారందరినీ మరీ గుర్తించి పిలిపించుకునేవారు. ఆయన(స) గారి దైవనమ్మకం ప్రకారమే అది అందరికీ సరిపోయి మరీ మిగిలి పోయేది. అంతేకాదు, ఆయన(స) గారి వద్ద ఎల్లప్పుడూ ఉండే అతిథులు కూడా కొందరు ఉండేవారు. వారికి కూడా ఆయన(స) ఎల్లప్పుడూ భోజన ఏర్పాట్లు చేసేవారు. ఇంకా ఇతర నగరాల నుంచి, పట్టణాల నుంచి వచ్చే బృందాలను సైతం ఆయన(స) గారు ఆతిథ్యాన్నిచ్చేవారు. ఈ విధంగా ఆయన(స)అతిథులకు ఆతిథ్యమిచ్చే, వారికి సేవ చేసే అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉండేవారు.

హజ్రత్ అబూహురైరా (ర) ఇలా అన్నారు : ఒకసారి ఒక ముస్లిమేతరుడైన ఒక వ్యక్తి దైవప్రవక్త(స) గారి వద్దకు అతిథిగా వచ్చాడు. అతని కోసం ఆయన(స) గారు మేక పాలు పితికి ఇచ్చారు. అది అతను గటగటా త్రాగేశాడు. అతనికి అవి సరిపోలేదు. రెండో మేక పాలను తీసి ఇచ్చారు. అవీ త్రాగేశాడు. కాని అవి కూడా సరిపోలేదు. ఈ విధంగా అతను ఒకటి కాదు, రెండు కాదు

ఏడు మేకల పాలను కూడా త్రాగేశాడు. ఆయన(స) గారు అతన్ని ఏమీ అనలేదు. పైగా గౌరవించారు. అతను ఆయన(స) గారి పట్ల ఎంత ప్రభావితుడయ్యాడంటే రెండో రోజు ఆయన(స) గారి వద్దకు వచ్చి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించాడు. (తిర్మిజీ)

ఒకసారి ఖైస్ వంశానికి చెందిన ఒక బృందం దైవప్రవక్త(స) గారి వద్దకు వచ్చింది. ఆయన(స) గారు వారి బాధ్యతను తన అనుచరులకు అప్పగించారు. వారు ఆ బృందాన్ని తమతోపాటు తీసుకుని వెళ్ళారు. రెండో రోజు ఆ బృంద ప్రజలతో కలసి ఆయన(స) మీకు అతిథి మర్యాదలు ఎలా జరిగాయి అని అడిగారు. వారు ఇలా అన్నారు : ఓ దైవప్రవక్తా(స)! మీ అనుచరులు చాలా మంచి వారు. మా కోసం మంచి భోజనాలను ఏర్పాటు చేశారు. మెత్తని పరుపులపై పరుండబెట్టారు. రాత్రి మాకు ధార్మిక విషయాలను బోధించారు. (ముస్నద్ అహ్మద్)

ఆతిథ్యమివ్వటం అనేది దైవప్రవక్త(స) గారి బోధనల ప్రకారం శుభాలతో కూడుకున్నది. కొద్దిపాటి శారీరక శ్రమ, సమయం, ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ అది ఇహపర లోకాలలో ఎంతో ఉపయోగకరమైనది. సాధారణంగా బహిర్గతమయ్యే విషయమేమిటంటే, అతిథుల రాక తమ సమయం ప్రణాళికను, తమ ఖర్చు ప్రణాళికను భగ్నపరిచేదిగా అనిపిస్తుంది. కాని అది సత్య విషయం కాదు. అతిథి తనతోపాటు తన ఉపాధిని కూడా తీసుకొస్తాడని చెప్పటం జరిగింది. అంటే శుభాలను తీసుకొస్తాడని అర్థం. మనం ఆలోచిస్తే ఆ శుభాలు ఏమిటో చక్కగా అర్థమవుతాయి. అతిథుల రాక ముందు ఇల్లంతా బోసిగా కనబడుతుంది. ఒకేవిధమైన దినచర్య ఉంటుంది. రోజూ చూసే ముఖాలే కనబడుతుంటాయి. ఒకే రకమైన జీవితాన్ని మనిషి ఒక సుదీర్ఘ కాలం వరకు భరించలేడు. ఇది మనిషి స్వభావం. మధ్యమధ్యలో బంధువులు, మిత్రులు వస్తూ పోతూ ఉంటే ఆ ఇంటి వాతావరణం కళకళలాడుతుంటుంది. ముఖాలు తళతళలాడుతాయి. పురుషులు పురుషులతో మాటల్లో మునిగిపోతారు. స్త్రీలు కబుర్లాడుకుంటూ వంటలు చెయ్యటంలో మునిగిపోతారు. పిల్లలు ఆటల్లో లీనమైపోతారు. పాత విషయాలను నెమరు వేసుకుంటారు. బంధువుల క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకుంటారు. హాస్యమాడుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ, ఒకరికొకరు హితబోధలు చేసుకుంటూ, సలహాలు ఇచ్చిపుచ్చుకుంటూ ఆహా ఎంత చక్కటి వాతావరణంలో ఆ సమయం గడుస్తుంది. ఎంత బలం సమకూరుతుంది. ఎంత ధైర్యం కూడగట్టుకుంటుంది. ఇదంతా ఒక మనిషి మనశ్శాంతికి చాలా అవసరం. మానసిక వ్యాధికి దివ్య ఔషధం. కనుకనే అల్లాహ్, ఆయన ప్రవక్త(స) అతిథి మర్యాదలను గురించి ప్రత్యేకంగా బోధించారు కూడాను. ఆచరించి మరీ చూపించారు కూడాను.

అయితే ఒక్కొక్కసారి మనం అతిథులుగా వారింటికి వెళ్ళినప్పుడు మనకు అతిథి మర్యాదలు మంచిగా చెయ్యనివారు కూడా మన వద్దకు అతిథులుగా వస్తారు. వారితో ఎలా మెలగాలి అనేది ఒక ప్రశ్న. ఎందుకంటే అక్కడ మన మనస్సు అడ్డుపడుతుంది. ఇదే ప్రశ్న దైవప్రవక్త(స) గారి ఒక అనుచరునికి కూడా వచ్చింది. ఆయన దైవప్రవక్త(స)ను అడిగి తెలుసుకున్నారు. ఓ దైవప్రవక్తా(స)! నేను ఒకరి వద్దకు వెళ్ళాననుకోండి. వారు నాకు అతిథి మర్యాదలేమీ చెయ్యలేదు. కాని వారు తరువాత నా వద్దకు వచ్చారు. అప్పుడు నేను వారితో దాని బదులుగా అలాగే వ్యవహరించనా? అని అడిగారు. దానికి సమాధానంగా ఆయన(స) ఇలా సెలవిచ్చారు: కాదు, నీవు ప్రతి పరిస్థితిలోనూ ఆ అతిథి ఆతిథ్యపు హక్కును నెరవేర్చు (మిష్కాత్). ఇది మనిషి మనస్సుకు కొద్దిగా కష్టమైనది. కాని మనస్సును నచ్చజెప్పుకుంటే మరీ అంత కష్టమేమీ కాదు.

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : ఒక దినం, ఒక రాత్రి పూర్తిగా అతిథికి గౌరవ మర్యాదలు తప్పకుండా చెయ్యాలి. ఇంకా మూడు దినాలు, మూడు రాత్రులు స్థోమతకు తగ్గట్టుగా చెయ్యాలి. కాని అతిథి మూడు రోజులకంటే ఎక్కువగా ఉండి ఇంటి వారికి కష్టంలో పడవెయ్యటం ధర్మసమ్మతం కాదు. (బుఖారీ)

ఇంటి వారు, అతిథులు దైవప్రవక్త(స) గారి ఈ బోధనలను అర్థం చేసుకుని, ఆచరిస్తే ఇహపరలోకాల శుభాలు సొంతమవుతాయి.






## జిల్లా స్థాయిలో మైనారిటీల గుర్తింపు చట్ట విరుద్ధం

మతపరమైన, భాషాపరమైన మైనారిటీ కమ్యూనిటీలను జిల్లా స్థాయిలో గుర్తించడం చట్టానికి విరుద్ధమని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. రాష్ట్రాల వారీగానే మైనారిటీల హోదాలను పరిశీలించాల్సి వుంటుందని జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ ఎస్.రవీంద్ర భట్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. దీనికి సంబంధించి ఒక పిటిషన్‌ను విచారించిన కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పెద్దగా ప్రాబల్యం లేని, సంఖ్యాపరంగా తక్కువున్న జిల్లాల్లో హిందువులకు మైనారిటీ హోదా రావడం లేదని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో మైనారిటీలను గుర్తించాలని కోర్టు డిక్లరేషన్ ఇవ్వాలని పిటిషన్ కోరింది. అయితే ఇది చట్టానికి విరుద్ధమని బెంచ్ వెల్లడించింది.

## ఆప్‌కు జాతీయ పార్టీ హోదా?

జాతీయ పార్టీ హోదాకు తమ పార్టీ  ఒక్క అడుగు దూరంలో ఉందని ఆప్ అధ్యక్షుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. గోవాలో కూడా రాష్ట్ర పార్టీగా ఆప్ గుర్తింపు పొందిందని, ఈ మేరకు తమకు ఎన్నికల సంఘం నుంచి సమాచారం వచ్చిందని కేజ్రీవాల్ చెప్పారు.  గత ఫిబ్రవరి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పనితీరుపై సమీక్ష అనంతరం ఎన్నికల కమిషన్ నుంచి తమకు రాష్ట్ర పార్టీ హోదా లభించిందని కేజ్రీవాల్ అన్నారు. ఆప్ ఇప్పటికే ఢిల్లీ, పంజాబ్‌లో రాష్ట్ర పార్టీగా గుర్తింపు పొందింది. ఆ రెండు రాష్ట్రాల్లో అధికారంలో కూడా ఉంది. ఇటీవల జరిగిన గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ రెండు అసెంబ్లీ స్థానాలు గెలుచుకుంది. 6.77 ఓటింగ్ శాతాన్ని సాధించింది. పంజాబ్‌లో 117 అసెంబ్లీ స్థానాలకు గాను 92 గెలుచుకుని ఘన విజయం సాధించింది. మొత్తం ఓట్ల శాతంలో 42.01 శాతం ఓటింగ్ శాతం పొందింది.

## భూదందాపై ప్రధాని మౌనం వీడాలి

అయోధ్యలో బీజేపీ నేతల భూదందా అంశాన్ని అత్యున్నత న్యాయస్థానం సుమోటోగా పరిగణించి విచారణ జరుపాలని ప్రతిపక్షాలు విజ్ఞప్తి చేశాయి. ఈ విషయంలో ప్రధాని నరేంద్రమోదీ మౌనం వీడాలని డిమాండ్ చేశాయి. బీజేపీ మేయర్, ఎమ్మెల్యేల, నేతలు అయోధ్యలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని ఆరోపిస్తూ 40 మంది ఆక్రమణదారుల పేర్లను అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ విడుదల చేయడంతో ప్రతిపక్షాలు భాజపాను దుయ్యబట్టారు. అయోధ్యలో భూస్కామ్ జరుగుతున్నదని ఏఐసీసీ అధికార ప్రతినిధి సుప్రియా ఆరోపించారు. తాము ముందు నుంచీ చెబుతున్న విషయాన్ని ఇప్పుడు అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ బయటపెట్టిందన్నారు. ఆక్రమణలకు పాల్పడిన బీజేపీ నేతలను అరెస్ట్ చేయాలని ఆప్ నేత సంజయ్ సింగ్ డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని కోరారు. బీజేపీ నేతలకు అవినీతిపైనే విశ్వాసం ఉన్నదని, రాముడిపై లేదని ఎద్దేవా చేశారు.

## మళ్లీ ఉద్యమిస్తాం

కొవిడ్ విజృంభణతో గత రెండేండ్లుగా చర్చల నుంచి పక్కకు పోయిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అంశాన్ని బీజేపీ నేతలు మళ్లీ కదిపారు. కరోనా బూస్టర్ డోసు ముగియగానే సీఏఏ అమలుకు నిబంధనల రూపకల్పన కోసం చర్యలు తీసుకుంటామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పారని పశ్చిమబెంగాల్ బీజేపీ నేత సువేందు అధికారి ఇటీవల పేర్కొనడం ఈశాన్య రాష్ట్రాల్లో మళ్లీ మంట రాజేసింది. ఉద్యమానికి  సిద్ధంగా ఉన్నామని, ప్రజలు కూడా తిరిగి ఉద్యమం ప్రారంభించేందుకు సిద్ధమవ్వాలని తాజాగా నార్త్ ఈస్ట్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్, క్రిషక్ ముక్తి సంగ్రామ్ సమితి, రాయ్‌జోర్ దాల్ తదితర సంస్థలు పిలుపునిచ్చాయి.

## బిహార్ నుంచి కొత్త నినాదం ప్రారంభమయింది

బిహార్‌లో నితీశ్ కుమార్  నేతృత్వంలోని జేడీయూ, లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ జట్టు కట్టడాన్ని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ స్వాగతించారు. ఇది మంచి ప్రారంభమన్నారు. త్వరలోనే మరిన్ని రాజకీయ పార్టీలు కాషాయ శిబిరానికి వ్యతిరేకంగా ఏకమవుతాయని ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ చెప్పారు. 1942లో బ్రిటిషర్లకు వ్యతిరేకంగా 'భారత్‌ను వదిలిపొండి' ఉద్యమం వచ్చిందని, ఇప్పుడు అలాంటి ఉద్యమం బీజేపీకి వ్యతిరేకంగా బిహార్‌లో ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. ఇతర రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలు, నాయకులు కూడా ఇదేవిధంగా బీజేపీకి వ్యతిరేకంగా గళమెత్తుతారని చెప్పారు.

## ఇంధన ధరల పెరుగుదలపై భగ్గుమన్న బంగ్లాదేశ్

ఇంధన ధరలను ఒకేసారి భారీ స్థాయిలో పెంచడంపై బంగ్లాదేశ్ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అక్కడ ఇంధన ధరలు ఒక్కసారిగా 52 శాతం మేర పెరిగాయి. ఆ దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఈ స్థాయిలో ఎన్నడూ ఇంధన ధరలు పెరగలేదని అక్కడి మీడియా పేర్కొన్న సంగతి తెలిసిందే. పెట్రోల్ ధరలు పెరిగిన మరుసటి రోజే బస్సు ఛార్జీలను కూడా పెంచుతున్నట్లు ప్రకటించడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలాదిగా ప్రజలు రోడ్లపై కి చేరుకుని ఆందోళనలు చేపడుతున్నారు. హేక్ హసీనా ప్రభుత్వంపై బ్యానర్లతో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

## మరోసారి గజాపై తెగబడ్డ ఇస్రాయిల్

గాజా తీర ప్రాంతంపై యూదు దురహంకార ఇజ్రాయిల్ మరోసారి వైమానిక, బాంబు దాడులతో విరుచుకు పడుతోంది. ఈ దాడుల్లో ఆరుగురు చిన్నారులతో సహా 29 మంది మరణించారు. ఇంకా అనేక మంది గాయపడ్డారు. 20 లక్షల మంది పాలస్తీనీయులు నివసిస్తున్న ఈ సన్నటి తీర ప్రాంతంపై ఇజ్రాయిల్ ఈ విధంగా దాడి చేయడం గత 15 ఏళ్లలో ఇది నాల్గవసారి. రెండు రోజుల్లో ఇజ్రాయిల్ సాగించిన దాడుల పరంపరలో ప్రాణ నష్టంతోబాటు, పెద్దయెత్తున ఆస్తి నష్టం సంభవించింది.దక్షిణ ఇజ్రాయిల్ నుంచి గాజాలోకి ప్రవేశించే మార్గాలను ఇజ్రాయిల్ మూసివేయడంతో ఇంధనం, ఆహారం, మెడికల్ సప్లయిలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇజ్రాయిల్ దుందుడుకు చర్యలను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సమర్థించుకొచ్చారు.

## నవంబరులో నేపాల్ సార్వత్రిక ఎన్నికలు

నవంబరు 20న నేపాల్‌లో ఒకే విడతగా సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయని ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికల కమిషన్ సిఫార్సుతో మంత్రివర్గ సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రతినిధుల సభ, ప్రావిన్షియల్ అసెంబ్లీలకు నవంబరు 20న ఎన్నికలు జరపాలని మంత్రివర్గం నిర్ణయిం చిందని సమాచార సాంకేతిక పరిజ్ఞాన శాఖ మంత్రి జ్ఞానేంద్ర బహదూర్ మీడియాకు తెలిపారు.




## మరో ఏడాది పాటు శ్రీలంకకు ఆర్థిక సమస్యలు

శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం మరో ఏడాది పాటు ఉండగలదని అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘే తెలిపారు. ఒక సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ విషయం చెప్పారు. దేశంలో మరింత పన్ను పెంచే విధానంగా సంస్కరణలు చేపట్టాలన్నారు. వచ్చే ఏడాది జూలై వరకు ప్రజలకు ఆర్థిక తిప్పలు తప్పవన్నారు. కొవిడ్-19 మహమ్మారి కూడా శ్రీలంక ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిందన్నారు. శ్రీలంకకు పర్యాటక రంగమే ముఖ్యమైన దన్ను అన్నారు. శ్రీలంక ఆర్థికంగా దివాళా తీసిందని, తిరిగి కోలుకోవాలంటే అత్యధిక పన్ను విధానం తప్పనిసరి అని ఆయన చెప్పారు.

## అవసరమైతే బల ప్రయోగం

తైవాన్‌ను స్వాధీనం చేసుకోవడానికి అవసరమైతే బలప్రయోగం చేయడానికి కూడా వెనుకాడబోమని చైనా పునరుద్ఘాటించింది. నాన్సీ పెలోసీ పర్యటన అనంతరం చైనా తైవాన్ విషయంలో దూకుడు పెంచింది. చైనాకు చెందిన తైవాన్ అఫైర్స్ ఆఫీసు ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. అందులో "విలీనానికి అవసరమైన ఏ చర్య తీసుకోవడానికైనా ఆప్షన్‌ను సిద్ధంగా పెట్టుకున్నాం. వేర్పాటు వాదులు, బాహ్య శక్తులు లక్ష్మణ రేఖను దాటడమే... మేము కఠిన చర్యలు తీసుకునేలా పురిగొల్పుతాయి' అని శ్వేత పత్రంలో పేర్కొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన కెన్యా అధ్యక్ష ఎన్నికలు

కెన్యాలో పార్లమెంటరీ, అధ్యక్ష ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. తదుపరి దేశాధ్యక్షుణ్ణి ఎన్నుకునేందుకు కెన్యా ప్రజలు భారీగా పోలింగ్ బూత్‌ల వద్ద క్యూ కట్టారు. పెరుగుతున్న ఆహార ధరలు, లోతుగా పాతుకుపోయిన అవినీతితో విసిగి వేసారి పోయిన పౌరులు... అధికార మార్పు కోసం భారీగా ఓటింగ్‌లో పాల్గొన్నట్లు సమాచారం. మాజీ అధ్యక్షుడు ఆరెంజ్ డెమొక్రటిక్ అలియన్స్ అభ్యర్థి రైలా ఒడింగా (77)తోపాటు ప్రస్తుత ఉపాధ్యక్షుడు, యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి విల్లియం రూటో (55) మధ్య హోరాహోరీ పోరు సాగనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత పోలింగ్‌లో జరిగిన అవకతవలకు దృష్టిలో ఉంచుకున్న ఎన్నికల సంఘం ఈ సారి భారీ భద్రత చర్యలు తీసుకుంది. కెన్యాలో గెలవాలంటే అభ్యర్థికి 50 శాతానికి పైగా ఓట్లు రావాల్సి ఉంటుంది. అలాగే కెన్యాలోని 47 కౌంటీల్లో 24లో పావు వంతు ఓట్లు అవసరం.

# మరో జీవితం లేదు అని తోసిపుచ్చితే జరిగే నష్టం ఏమిటి?

ఈ జీవితం ముగిసాక మరో జీవితం ఉంది అన్న ప్రశ్న గురించి ఎందుకు ఆలోచించాలి? అనే ఆలోచన ఉత్పన్నం కావొచ్చు. మరో జీవితాన్ని నమ్మినా, నమ్మకపోయినా మనకు ఒరిగేదే ముంది. నా ప్రియ సోదరీ, సోదరుడా. ఇదొక సిద్ధాంతానికో, మత విశ్వాసానికో, చర్చనీయాంశమైన విషయానికో పరిమితం కాదు. ఇది మన జీవిత లక్ష్యంతో ముడిపడి ఉన్న చిక్కుముడి. ఈ నమ్మకం పైనే మన యావత్తు జీవిత గెలుపు ఓటములు దాగి ఉన్నాయి. మన రాబోయే జీవితం ఎలా ఉంటుంది. మరో జీవితాన్ని నమ్మినట్లయితే అక్కడి జీవితంలో విజయం సాధించేం దుకు శ్రమిస్తాము. ఒకవేళ నమ్మకుండా త్రోసిపుచ్చినట్లయితే జీవితాన్ని మనోకాంక్షలకు అనుగుణంగా గడుపుతాము. ఇప్పుడు మనకు దాని ప్రాధాన్యత గురించి తెలియదు. ఎందుకంటే మనం ఇప్పుడున్న స్థితిలో పూర్తి ఆరోగ్యంగా ఉన్నాము (ఇప్పుడే మనకు మృత్యువు రాదు అన్న ఆలోచనలో ఉన్నాము). కానీ మరణానికి సమయం సందర్భం అంటూ ఏదీ లేదు. ఎవరు ఎప్పుడు ఎక్కడ తన ప్రభువును కలుసుకోవడానికి వెళ్లిపోతారో ఎవరికీ తెలియదు. ఏమిటీ జీవితం? ఎందుకీ జీవితం? దీనికంటూ ఒక లక్ష్యం లేదా? అనే ప్రశ్నలు వేసుకోవాలి. మనం ప్రతీ చిన్న విషయంలో దాని ఉద్దేశమేమిటి? దాని పర్యవసానం ఏమిటి? అని ఆలోచి స్తాము. అందుకోసం సిద్ధమవుతాము. మరి జీవితాన్ని గురించి ఎందుకు ఆలోచించము?

నేను మిమ్మల్ని అప్రమత్తం చేయాలనుకుంటున్నాను. ఈ జీవితం కొన్ని రోజుల పరీక్ష. మనం చేసుకున్న కర్మలన్నింటి గురించి మూల్యాంకనం జరుగుతుంది. అప్పుడు మన జయాపజయాల మీద మన శాశ్వత జీవితం ఆధారపడి ఉంటుంది. శాశ్వత సుఖసౌఖ్యాలో లేక దుఃఖం, యాతనలతో కూడిన జీవితమో తెలుస్తుంది.

ఈ వాస్తవం కళ్లముందు ప్రత్యక్షమయ్యే ఆ రోజు ఎంతో సంక్లిష్టంగా ఉంటంది. సిద్ధమవ్వకుండా ఆ రోజును ఎదుర్కోవడం గుండెలు పగిలేంత పనవుతుంది. తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి ఉంటుంది. ఆ రోజును గురించి దేవుడు కళ్లకు కట్టినట్లు తన గ్రంథంలో వివరిస్తున్నాడు.

అల్లాహ్‌యే సృష్టిని ప్రారంభిస్తాడు, ఆయనే దానిని తిరిగి సృష్టిస్తాడు, తరువాత ఆయన వైపునకే మీరు మరలింపబడతారు. ఆ గడియ నెలకొన్ననాడు, అపరాధులు దిగ్భ్రమకు లోనవుతారు. (దివ్య ఖుర్‌ఆన్ 30:11,12)

తన కర్మల పత్రం తన ఎడమ చేతికి ఇవ్వబడిన వ్యక్తి ఇలా వాపోతాడు, "అయ్యో! నా కర్మల పత్రం నాకు అసలు ఇవ్వకుండా ఉంటే, నా లెక్క ఏమిటో నాకు అసలు తెలియకుండా ఉంటే ఎంత బాగుండేది! అయ్యో! నాకు (ప్రపంచంలో వచ్చిన) ఆ మరణమే ఏకంగా అంతిమ మరణమై ఉంటే ఎంత బాగుండేది! ఈనాడు నా ఆస్తి నాకు ఏ మాత్రం పనికి రాలేదే. నా అధికార మంతా అంతరించిపోయిందే. (దివ్య ఖుర్‌ఆన్ 6: 25-29)

వారు ఈనాడు ఇలా అంటారు : "జీవితం అంటే కేవలం ఇహలోక జీవితమే. మరణం తరువాత మనం మళ్ళీ లేపబడటం అనేది జరగదు." వారు తమ ప్రభువు ముందు నిలబెట్టబడే దృశ్యాన్ని నీవు చూడగలిగితే ఎంత బాగుండును! అప్పుడు వారి ప్రభువు వారిని "ఇదంతా యథార్థం కాదా?" అని అడుగుతాడు. వారు ఇలా అంటారు : "అవును మా ప్రభూ! ఇదంతా యథార్థమే!" అప్పుడు ఆయన ఇలా సెలవిస్తాడు : "సరే, అయితే మీరు యథార్థాన్ని తిరస్కరించిన దానికి ఫలితంగా ఇప్పుడు శిక్షను చవిచూడండి." (దివ్య ఖుర్‌ఆన్ 6:29-30)

ఎంతటి సంక్లిష్ట నిర్ణయాత్మక ఘడియలో మీరే చదివారుగా.. మనిషి ఎంతగా నిస్సహాయుడైపోతాడు ఆ రోజున. జీవిత సంపద కరిగిపోతుంది. పరీక్ష ఘడియ ముగిసిపోతుంది. మనం ఆ రోజున ప్రభువు ముందు ఉట్టి చేతులతో నిల్చోవడం ఎంతటి విచార కరం. మనల్ని పుట్టించిన వాడి ముందు సిగ్గుపడకుండా, ఆ మహా కష్టం నుండి కాపాడబడాలని నేను, మీరు కోరుకోవద్దా. ఈ ప్రపంచంలోకి తిరిగి పంపబడటమనేది జరగదు. సత్యాన్ని తెలుసుకుని, దాన్ని ఆచరించి, అందుకోసం సిద్ధమవడం మన విధి కాదా?

కాసేపు మనసుపెట్టి ఆలోచించండి. నేను, మీరు దీనిపై శ్రద్ధగా ఆలోచించాలి. మనందరి జీవిత సవాలు ఇది.

దేవుడు మనందరికీ మేలు చేయుగాక.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**